


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 24-11-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 42 సంచిక : 64 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### భారీగా తగ్గిన
## పెట్రోలు, డీజిలు ధర

- దేశవ్యాప్తంగా 40-45పైసలు తగ్గింపు
- ఒక్క నవంబరులోనే రూ.4లు తగ్గిన పెట్రోలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో దేశీయంగా కూడా పెట్రోల్, డీజిలు ధరలు కూడా తగ్గుతున్నాయి. దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధర లీటరుకు 40-44 పైసలు తగ్గిస్తున్నట్టు దేశీయ ఆయిల్ కంపెనీలు శుక్రవారం ప్రకటించాయి. దీంతో ఢిల్లీ, కోలకతా, ముంబై, చెన్నై, హైదరాబాద్, విజయవాడ సహా ఇతర నగరాల్లో పెట్రోలు, డీజిలు ధరలు మరింత దిగి వచ్చాయి. ముఖ్యంగా అక్టోబరులో నింగిని తాకిన పెట్రోలు ధర ఇప్పటివరకూ రూ.8 లు దిగి వచ్చింది. ముఖ్యంగా ఈ నవంబరు నెలలో లీటరు పెట్రోలు ధరరూ.4లు , డీజిలు ధర రూ.3.10 మేర తగ్గింది.

**హైదరాబాద్** : లీటరు పెట్రోలు ధర లీటరుకు రూ. 80.12 డీజిలు ధర రూ. 76.77

**విజయవాడ** : పెట్రోలు ధర లీటరుకు రూ. 79.39, డీజిలు ధర రూ. 75.64

**ఢిల్లీ**: లీటరు పెట్రోలు ధర రూ. 75.57, డీజిలు ధర్ రూ. 70.56

**ముంబై**: లీటరు పెట్రోలు ధర లీటరుకు రూ. 81.10, డీజిలు ధర రూ. 73.91 తరువాయి 2లో..

### పెళ్లి రోజునే
# చంద్రన్న పెళ్లి కానుక



- కరువు జిల్లాలో కియా కారు
- 16 లక్షల కోట్ల పెట్టుబడితో
- 30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం
- మైక్రో ఇరిగేషన్‌తో నీటి పొదుపు సాధ్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అనంతపురం: కరువు జిల్లాలో కియా కారు రానుందని, జనవరిలో కియా కారు రాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కప్పలబండ గ్రామదర్శినిలో పాల్గొని ప్రసంగించారు. హంద్రినీవా నీటితోనే సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 36 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పెళ్లి రోజునే చంద్రన్న పెళ్లి కానుక అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. 16 లక్షల కోట్ల పెట్టుబడితో 30 లక్షల తరువాయి 2లో..

## ప్రజలే నా బాసులు

- మన గొంతు కోసే చంద్రబాబును గెలిపిద్దామా?
- తెలంగాణ మీద చంద్రబాబు పెత్తనం ఏంది?
- 17 మంది ఎంపీలనూ గెలిపించాలి
- టీఆర్ఎస్ అధినేత కేసీఆర్



వరంగల్: తమకు బాసులు ఢిల్లీలో లేరని, ప్రజలే తమ బాసులని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఢిల్లీకే వెళ్లాలని ఎద్దేవాచేశారు. తెలంగాణ తరువాయి 2లో..

### మోదీ ప్రసంగాల్లో
## విషయమేమీ లేదు

- ఆయన ఇచ్చే హామీలన్నీ నీటిమూటలే
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీ
- రఫేల్ ఒప్పందంపై భాజపాను నిలదీస్తా
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ



విదిశ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాల్లో విషయమేమీ లేదని దేశంలో అందరికీ అర్థమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. 2014 ఎన్నికలకు ముందు ఆయన మాట్లాడిన విషయాల గురించి ప్రస్తావిస్తే ఇప్పుడు ఏమాత్రం స్పందించడం లేదని అన్నారు.

మధ్యప్రదేశ్‌లోని విదిశలో శుక్రవారం ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న రాహుల్ మోదీపై విమర్శలు గుప్పించారు. మోదీ సాధారణంగా అవినీతి, రైతులు, నిరుద్యోగం గురించి మాట్లాడుతుంటారని, ఇప్పుడు ఆ విషయాల గురించి ఏమీ మాట్లాడట్లేదన్నారు. దేశంలోని ప్రజలకు ఆయన మాట్లాడేదాంట్లో విషయమేమీ లేదని తెలిసిందని, ఆయన ఇచ్చే హామీలన్నీ అబద్ధాలని రాహుల్ విమర్శించారు.

2014 ఎన్నికల ముందు మోదీ రుణ మాఫీ, రైతులకు బోనస్, పంటలకు మంచి మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలన్నీ ఎందుకు నెరవేర్చలేదు? అని రాహుల్ ప్రశ్నించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. యువతకు ఉద్యోగ కల్పన కోసం ముఖ్యమంత్రి రోజుకు తరువాయి 2లో..

# వృక్షో రక్షతి రక్షితః

- మొక్కలు నాటడమే కాదు సంరక్షించాలి
- చెట్లు పెంచి సమతుల్యతను పాటించాలి
- చెట్లు లేని భవిష్యత్తు శూన్యం
- జిల్లాలో పచ్చదనం పెంపునకు కృషి
- ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి
- రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నంః పుట్టిన రోజునాడు వేడుకలలో భాగంగా ప్రతీ విద్యార్థి ఒక మొక్కను నాటాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కార్తీక వన మహోత్సవం సందర్భంగా శుక్రవారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అంటూ మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో నాటిన ప్రతీ మొక్కనూ సంరక్షించడం కూడా అంతే ముఖ్యమన్నారు. చెట్లు నరకడం, మైనింగు, కాంక్రీట్ వినియోగం తదితర నిర్మాణాల వలన వాతావరణంలో సమతుల్యత లోపిస్తుందని, కర్మాగారాలతో పాటు ప్రతీ చోట చెట్లు పెంచి సమతుల్యతను కాపాడాలన్నారు. 50 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ప్రతీ ఒక్కరూ ఈ విషయం ప్రాముఖ్యతను గుర్తించి మొక్కలు నాటాలన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్ మాట్లాడుతూ చెట్లను పెంచి కాపాడకపోతే భవిష్యత్తు ఉండదన్నారు.

నన్నయ్య యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం నీరు కొనుక్కొని తాగుతున్నాం.. మనం చెట్లను పెంచకపోతే త్వరలో గాలిని కూడా కొనుక్కోవలసి వస్తుందని అన్నారు.

చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే మాట్లాడుతూ జిల్లాలో 24 కోట్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో 3 లక్షల కొబ్బరి చెట్లు కూడా పెంచుతున్నామన్నారు. జిల్లాలో పచ్చదనం పెంచడానికి కృషి చేస్తున్నామని, విద్యా సంస్థలు, ఎన్‌జిఓలు ఇతర అన్ని సంస్థలు కూడా కృషి చేయాలని కోరారు. 2029 నాటికి జిల్లాలో 50 శాతం గ్రీనరీ లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. అంతకు ముందు మంత్రి, ఇతర ప్రముఖులు మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్టు అధికారులు, జిల్లా పరిషత్ సిఇఓ రమణమూర్తి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జగన్‌కు కళా బహిరంగ లేఖ

- ఏనాడైనా ప్రజల కోసం పని చేశారా?
- రాఫెల్ కుంభకోణంపై ఎందుకు మాట్లాడరు?



అమరావతి: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు మంత్రి కళా వెంకట్రావు బహిరంగ లేఖ రాశారు. ప్రతిపక్ష నేతగా జగన్ ఏనాడైనా ప్రజల కోసం పని చేశారా అని ప్రశ్నించారు. కేసుల మాఫీ కోసం ప్రధాని మోదీ, బీజేపీ అధినేత అమిత్ షాతో కుమ్మక్కై... తరువాయి 2లో..



# ప్రేమకు ప్రతిరూపం శ్రీ సత్యసాయి



విశాఖపట్నం: రైల్వే న్యూ కాలనీ, సుబ్బలక్ష్మినగర్‌లో గల శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 93వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినాము.

ఈ వేడుకలను భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఆంతరంగిక భక్తులు కేతవరపు గణేష్ రజనీ దంపతులు జ్యోతిని వెలిగించి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయిబాబా ప్రేమకు ప్రతిరూపంగా నిలవడమే కాకుండా సేవకు ప్రాధాన్యతనిచ్చి లక్షలాదిమందికి ఆధ్యాత్మిక చింతనను అలవరచి సేవాభావాన్ని కలుగజేశారని తెలిపారు. శ్రీ సత్యసాయి బాబావారిని ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ ప్రేమతో, సేవతో నిస్వార్థంగా జీవించాలన్నారు. సత్యసాయి నిర్వహించిన వైద్య, ఆధ్యాత్మిక సంకీర్తన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్య క్రమంలో కె. అప్పలరాజు, కె. మల్లికార్జునరావు, కె. ఉమ, కె. లలిత, సత్యసాయి భక్తులు, పరిసర ప్రాంతవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## వచ్చేనెల 2న క్షత్రియ పరిషత్ పిక్నిక్



విజయనగరం: జిల్లా వ్యాపితంగా ఉన్న క్షత్రియులంతా ఒక వేదికపై కలిసి పనిచేస్తున్నారని వారి ఉన్నతికోసం పరిషత్ ఏర్పడిందని క్షత్రియ పరిషత్ కార్యదర్శి జి.రామరాజు, అధ్యక్షులు పి.వి.నరసింహరాజు తెలిపారు. శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిసెంబర్ 2వ తేదీన నెల్లిమర్ల సమీపాన గల దత్తా ఎస్టేట్స్ లో కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేశామని, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని క్షత్రియులంతా హాజరుకావాలని కోరారు.

## మొదటి పేజీ తరువాయి

### పెళ్లి రోజునే చంద్రన్న పెళ్లి కానుక

మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సీఎం యువనేస్తం కింద నిరుద్యోగులకు వెయ్యి రూపాయల భృతి ఇస్తున్నట్లు చెప్పారు. నదుల అనుసంధానం ద్వారా జిల్లాలోని అన్ని చెరువులకు నీరిస్తున్నామని, మైక్రో ఇరిగేషన్‌తో నీటి పొదుపు సాధ్యమని చంద్రబాబు పేర్కొన్నారు.

### భారీగా తగ్గిన పెట్రోలు, డీజిలు ధర

కోలకతా: లీటరు పెట్రోలు ధర లీటరుకు రూ. 77.53, డీజిలు ధరరూ. 72.41

చెన్నై: లీటరు పెట్రోలు ధర లీటరుకు రూ. 78.46, డీజిలు ధర రూ. 74.55

మరోవైపు డాలరు మారకంలో దేశీయ కరెన్సీ రూపాయి కూడా భారీగా బలపడింది. నిన్న(గురువారం) దాదాపు మూడు నెలల తరువాత రూ.71నుంచి పైకి ఎగబాకింది.

### మోదీ ప్రసంగాల్లో విషయమేమీ లేదు

18గంటలు పనిచేస్తారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో మధ్యప్రదేశ్‌ను అగ్రికల్చర్ హబ్‌గా మారుస్తామన్నారు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో రైతు సమస్యలు, నిరుద్యోగం అధికంగా ఉన్నాయని తెలిపారు. మన దేశంలో రోజుకు కేవలం 450 మంది యువతకు ఉద్యోగాలు దక్కుతున్నాయని, అదే చైనాలో రోజుకు 50వేల మంది ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం వ్యాపం కుంభకోణంతో విద్యా రంగాన్ని నాశనం చేసిందని ఆరోపించారు. ఈ సందర్భంగా రాహుల్ రఫేల్ ఒప్పందంపైనా భాజపాను దుయ్యబట్టారు.

### ప్రజలే నా బాసులు

మీద చంద్రబాబు పెత్తనం అవసరమా? కత్తి ఆంధ్రోడిదే.. పొడిచేది తెలంగాణోడు. ప్రాజెక్టులు ఆపాలని చంద్రబాబు 35 ఉత్తరాలు రాశారు. మన గొంతు కోసే చంద్రబాబును గెలిపిద్దామా? చంద్రబాబు మీ ఇంటికే వచ్చి కొట్టిపోతా అంటున్నాడు. మనం అంత పౌరుషం లేకుండా ఉన్నామా?. చంద్రబాబును మోసుకొచ్చినవారిని ఓటుతో తరిమికొట్టాలి. ఉన్న తెలంగాణ ఊడగొట్టి ముంచిన పార్టీ కాంగ్రెస్. నాడు విద్యార్థులను పిట్టల్లా కాల్చింది కాంగ్రెస్ పార్టీ కాదా? తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వనని మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అంటే ఒక్క కాంగ్రెస్ నేత నోరు తెరవలేదు. వాళ్లను చూస్తేనే మీ లాగులు తడిసిపోయాయి అని ఎద్దేవాచేశారు.

17 మంది ఎంపీలను గెలిపించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఢిల్లీ మెడలు వంచి ముస్లిం, ఎస్టీ రిజర్వేషన్లు సాధిస్తామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ పూర్తి కావొచ్చిందని, ఒకటి, రెండు నెలల్లో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇస్తామని ఆయన చెప్పారు. ఐకేపీ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, 200 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడతామన్నారు. ప్రజల చేతిలో పెత్తనం పెట్టి వాళ్లకే అధికారం ఇస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు.

### జగన్‌కు కళా బహిరంగ లేఖ

రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని లేఖలో ఆయన ఆరోపించారు. తుపానుతో సిక్కోలు కకావికలమైతే బాధితులను ఎందుకు పరామర్శించలేదని, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాదయాత్ర చేస్తున్నప్పటికీ... రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు నిధులపై ఏనాడైనా ప్రశ్నించారా అని నిలదీశారు. పోలవరం డీపీఆర్-2కు కేంద్రం కొర్రీలపై ఎందుకు మాట్లాడరని, రాఫెల్ కుంభకోణంపై జగన్ ఎందుకు మాట్లాడటం లేదని లేఖలో కళా వెంకట్రావు పేర్కొన్నారు.

# ఘనంగా రాధాకృష్ణ మహోత్సవం



భీమునిపట్నం : స్థాని క బీచ్ సమీపం లో గోకుల్ పరక వద్ద నియోజక వర్గ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో శ్రీ శ్రీ శ్రీ రాధాకృష్ణ మహోత్సవ గంమ్గా నిర్వహించారు.ఉదయం సముద్ర వద్ద పాలు పెరుగు యదమేళ పూజాకార్యక్రమాలు భీమిలి వై.ఎస్.ఆర్ సి.పి.సమన్వయ కర్త అక్రమాని విజయనిర్మల వెంకటరావు దంపతులు , మాజీ జడ్పీటీసీ బమ్మిడి ఉమా సూర్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఈ కార్యక్రమం కు మంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు వచ్చి దర్శించు కున్నారు.అలాగే అనకా పల్లి ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వంశి క్రిష్ణయాదవ్ లు , దర్శించు కున్నారు ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇంచార్జీ శ్రీ విజయ్ బాబు గారు, జిల్లా పరిషత్ చైర్మన్ లాలం భవానీ భాస్కరరావు , భీమిలి మండల ఎంపిపి యరబాల కృష్ణవేణి అనిల్ ప్రసాద్ , భీమిలి మండల పార్టీ కార్యదర్శి పాశి నర్సింగరావు , , భీమిలి డివిజన్ కార్యదర్శి గొలగాని నరేంద్ర , ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు బి ఆర్ బి నాయుడు , మొల్లి లక్ష్మణరావు , 4వ వార్డు ప్రెసిడెంట్ మన్యాల సోంబాబు , ఉత్సవ కమిటీ సభ్యులు యలమంచిలి.సూర్యనారాయణ, గ ం డ్డా ల . య ం ల్ల య ్ య , అ క్క ం వ వా ని వెంకటరావు,పి.రమణ,కోడిబోయిన రమణ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రేపే జిల్లా స్థాయి నవోదయ నమూనా పరీక్ష

భీమునిపట్నం: శ్రీ రామానుజన్ సంస్థ ఆధ్వర్యంలో రేపు అనగా ఆదివారం 25న జిల్లా స్థాయి నవోదయ నమూనా పరీక్ష అండ్ అవగాహన కొరకు ఐదవ తరగతి చదువుచున్న విద్యార్థిని విద్యార్థులకు నవోదయ పరీక్ష మరియు అవగాహన సదస్సు నాయుడు జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ బైపాస్ రోడ్ తగరపువలస లో ఉదయం తొమ్మిది నుండి పన్నెండు వరకు జరుగుణని పరిక్ష నిర్వాహకులు సి.హెచ్ సురేష్ తెలిపారు ఇందులో మొదటి, ద్వితీయ,తృతీయ బహుమతులు మరియు స్టడీ మెటిరియల్ ఇస్తారని తెలిపారు.వివరాల కోసం 9573329069, 8328643547 లను సప్రదించాలని కోరారు.

## డిపో మేనేజర్ వేధింపులు భరించలేక ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



గోపాలపట్నం: గోపాలపట్నం పరిధి సింహాచలం ఆర్టీసీ బస్సు డిపో లో డ్రైవర్ గా పనిచేస్తున్న చింతనాగేశ్వర్ రావు (50) అనే వ్యక్తి సింహాచలం డిపో మేనేజర్ వేధింపులు తాళలేక చనిపోతున్నట్టుగా తన చావుకు డిపో మేనేజర్ కారణము అని తనచేతిపై వ్రాసుకొని పురుగులమందు త్రాగి చనిపోయాడు ఈ విషయమై పూర్తి వివరాలు ఇంకా బయటకు రావలసి ఉంది.

## ధైర్యలక్ష్మికి ప్రత్యేక పూజలు

విజయనగరం: ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో ధైర్యలక్ష్మికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.శుక్రవారం ఉదయం దేవాలయం ప్రధాన అర్చకులు అంపోలు లక్ష్మీ నరసింహా చార్యులు, చామర్తి రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో ధైర్యలక్ష్మికి వేదమంత్రాల నడుమ అర్చన, పంచామృతాభిషేకాలును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ,ఉమాదేవి దంపతులు, ప్రకాష్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ సతీష్‌ను పరామర్శించిన మంత్రి గంటా

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ 15 వ వార్డు కౌన్సిలర్ చెరుకూరి సత్యన్నారాయణ (వికాస్ సతీష్ ) ఊపిరితిత్తుల సంబందిత సమస్యతో ప్రాణాపాయస్థితిలో కేర్ హాస్పిటల్ లో జాయిన్ అయ్యారు . సమాచారం తెలుసుకున్న విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు వెంటనే కేర్ వైద్య బృందంతో మాట్లాడి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూశారు . ప్రాణాపాయం నుండి బయటపడిన సతీష్‌ను , మంత్రి గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం పరమర్శించారు . ఎలాంటి సమస్య ఉన్నా తాను అండగా ఉంటానని , ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చార్లు. తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులకు ఎవరికి కష్టమొచ్చినా ఆదుకుంటానని మంత్రి అన్నారు.

# గంటాకు వినతి పత్రం



భీమునిపట్నం: భీమిలి శ్రీ వీరాంజననేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం తరుపున గత తొమ్మిది సంవత్సరాల నుండి అయ్యప్ప స్వాములకు మరియు ఇతర దీక్షాపరులకు నలభై ఐదు రోజులు పాటు సుమారుగా ఎనిమిది వందల మందికి వరకూ భీమిలి బీచ్ పార్క్ వద్ద వున్న అయ్యప్ప దయన మందిరం లో అన్నదానం చేయుచున్నామని ఈ కార్యక్రమం సాల లో జరుగుతోందని నిర్వహణకు ఇబ్బంది కలుగు తున్నాదని ఇది ముందుముందు మరింత అభివృద్ధిచేయుటకు మాకు స్వంత భవనము నిర్మంచు కొరకు అవకాశం బట్టి ఈ పరిసరాలని పరిశిలించి భవన నిర్మాణం కు అనుమతి ఇవ్వాలని సేవాసంఘం సభ్యులు నాయుడు స్వామి మంత్రి వర్యులు గంటా శ్రీనివాసరావు కు వినతి పత్రం అందజేసారు.ఇదులో ఇన్ చార్జ్ చిక్కల విజయబాబు ,ఎం.పి.పి యరబాల కక్రిష్ణవేణి అనిల్ ప్రసాద్ నరేంద్రలు పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారానికి గ్రామదర్శిని వేదిక కావాలి

### ఎమ్‌పిడిఓ జగదాంబ



రావులపాలెం: గ్రామాల్లో జరిగే వివిధ రకాల అభివృద్ధి పనులకు, గ్రామంలో గల సమస్యల పరిష్కారానికి గ్రామ దర్శిని కార్యక్రమం వేదిక కావాలని ఎమ్‌పిడిఓ పి. జగదాంబ అన్నారు. శుక్రవారం మండల పరిధి పొడగట్లపల్లిలో జరిగిన గ్రామ దర్శిని కార్యక్రమానికి ఎమ్‌పిడిఓ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. గ్రామ దర్శిని సభలో ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహిస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భముగా గ్రామంలో పలు సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు. అంబేద్కర్ నగర్‌లో గత 8 నెలల నుండి త్రాగునీటి సమస్య అధికంగా ఉందని, సత్వరమే పైపు లైన్లు పునరుద్ధరించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు తెలపడంతో వెంటనే త్రాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో పారిశుద్య నివారణ, వీధిలైట్లు, త్రాగునీటి సమస్య లేకుండా కార్యదర్శి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు కావాలంటూ వచ్చిన దరఖాస్తులు వస్తున్నాయని వాటిని తక్షణం పరిష్కరించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఐ మాణిక్యం ఆధ్వర్యంలో పంచాయితీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సామూహిక అన్న ప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ పిఆర్‌డి కె. వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి బి. మీన, ఎపిఎమ్ జిలాని, మాజీ సర్పంచ్ కుడుపూడి వెంకటేశ్వర్లు, గోపిశెట్టి సత్తిపండు, అల్లూరి కృష్ణంరాజు, వెలుగొట్ల త్రిమూర్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కె. సూర్యకళ, సంకు శ్రీలక్ష్మి, జి. సరోజిని, ఎమ్. రజని కుమారి, ఎ. ధనలక్ష్మి, బి. ఆదిలక్ష్మి, టి. పద్మావతి, పి. పద్మాస్‌కుమారి, సిహెచ్ రాజేశ్వరి, పంచాయితీ కార్యదర్శి నిమ్మకాయల బ్రహ్మాజి, ఆశా వర్కర్లు, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలకు సంప్రదాయం తెలిపేందుకే హారతి

### రోడ్లు భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం: భావితరాల వారికి హిందూ సంప్రదాయం తెలియజేసేందుకే ఉత్తర వాహిని కార్తీక పౌర్ణమి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమి రోజున వరాహ నది ఉత్తర వాహిని వద్ద ఆయన జల హారతి నిర్వహించారు. ఈరోజు ఎంతో పవిత్రమైన దినం అని హిందూ సాంప్రదాయం ప్రకారం కార్తీక మాసం లో స్త్రీలు ఉపవాసాలు పూజలు కార్తీక స్నానాలు మొదలైనవన్నీ చేసి శివకేశవులను ఆరాధిస్తూ ఉంటారని తెలిపారు. ఇటువంటి పవిత్రమైన పౌర్ణమి రోజున ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న నదికి పంచహారతులు నిర్వహిస్తే, కనీసం హారతిని చూసి తరించిన వారికి కూడా ఎంతో పుణ్యం కలుగుతుందని చెప్పారు. కాశీలో గంగానది తరువాత ఇక్కడే ఉత్తరవాహిని ఉన్నదని ఈ ప్రాంతాన్ని ఎంతో అభివ అద్ధి చేశామని చెప్పారు. గతంలో ఈ నది ఒడ్డున శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయం ఉండేదని వరదలకు ఆలయం కొట్టుకుపోగా గత సంవత్సరం దానిని పునర్ నిర్మించామని తెలిపారు. రాజమండ్రి విజయవాడ లలో పుష్కర ఘాట్ల మాదిరిగా ఇక్కడ కూడా ఘాట్ లను నిర్మించామన్నారు. శ్రీ బ్రహ్మ కుమారి వారు ఏర్పాటు చేసిన లింగానికి మంత్రి దండ వేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

## కాకినాడలో తనిష్క్ షోరూం ప్రారంభించిన బిజూ అలెగ్జాండర్

### ప్రతీ కొనుగోలుపై బంగారు నాణెం ఉచితం



కాకినాడ : ప్రముఖ ఆభరణ విక్రయ సంస్థ తనిష్క్ నూతన 78వ షోరూంను శుక్రవారం స్థానిక దేవాలయం వీధిలో ప్రారంభమయ్యింది. దక్షిణభారత వ్యాపార నిర్వహణా ఇన్‌చార్జి బిజుఅలెగ్జాండర్ షోరూంను ప్రారంభించి మాట్లాడుతూ గతంలో గోల్డ్‌ప్లస్,ఏటాటా ప్రొడక్ట్ సంస్థ తనిష్క్ నెట్ వర్కులో భాగమయ్యిందన్నారు. తమకు దేశ వ్యాప్తంగా 274,దక్షిణ భారత దేశంలో 78 షోరూంలు ఉన్నాయని తెలిపారు. అత్యాధునిక, నేటితరపు మహిళల వినూత్న ఆలోచనలకు అనుగుణంగా వివిధ డిజైన్‌లలో స్వచ్ఛమైన బంగారు ఆభరణములు అందుబాటులో ఉంటా యన్నారు.అలాగే సుమారు 5వేలకు పైగా న ం ప్ర దా య ం , పా శ్చా త్య మరియు ఫ్యూజన్ లుక్స్‌ను బంగారు మరియు జెమ్-సెట్ జ్యూవెలరీ(22మరియుకెరట్ బంగారంలో) తనిష్క్ అందిస్తుందన్నారు. దేవ వ్యాప్తంగా 170 నగరాల్లో 274 ఎక్స్‌క్లూజివ్ బొటిక్‌ల ద్వారా తమ కార్యకలాపాలు నిర్వమిస్తుందన్నారు.షోరూం యజమానులు కృష్ణంరాజు, శివకుమార్‌లు మాట్లాడుతూ ప్రారంభ వేడుకులను పురష్కరించుకొని ఈనెల23 నుండి25వతేదీ వరకు కొనుగోళ్లపై ఉచిత బంగారు నాణెం అందిస్తున్నామన్నారు.ఖాతాదారులు తమను ఆదరించాలని కోరారు. ఈకార్యక్రమంలో షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల అభివృద్ధికి కృషి



నర్సీపట్నం: మున్సిపాలిటీలోని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు అన్నారు. శుక్రవారం మున్సి పాలిటీలోని 27వ వార్డులో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో సన్యాసి పాత్రుడు మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వార్డుల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వార్డులో అవసరాలను గుర్తించి వాటి పరిష్కారం కోసమే గ్రామదర్శి కార్యక్రమం చేపట్టామన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, నాయకులు మాకిరెడ్డి అప్పారావు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సీసీ కెమెరా ఏర్పాటు

గొలుగొండః జోగుంపేట జంక్షన్‌తో పాటు ఏటిగైరంపేట గ్రామాల్లో గల ప్రధాన జంక్షన్‌లో సిసి కెమెరాలను గొలుగొండ పోలీసులు ఏర్పాటు చేశారు.

దీంతో ప్రధాన జంక్షన్‌లో అసాంఘిక కార్యక్రమాలతో పాటు చట్టవ్యతిరేక కార్యక్రమాలపై నిఘా ఉంచేందుకు ఉన్నతాధికారులు ఈ నిఘా నేత్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. అలాగే గంజాయి అక్రమ రవాణా, ప్రమాదాలకు గురైన సంఘటనపై ఆధారాలు సేకరించేందుకు ఈ సిసి కెమెరాలు దోహదపడతాయన్నారు. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రజలకు ఉందన్నారు.

## నూకాంబికా ఆలయంలో వన మహోత్సవం



అనకాపల్లి : పట్టణంలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం పలుచోట్ల మొక్కలు నాటారు. వన మహోత్సవంలో భాగంగా అమ్మవారి కాటేజీలో గార్డెన్ వద్ద ఆలయ మాజీ చైర్మన్ కొణతాల వెంకటరావు ఆధ్వర్యంలో వీటిని నాటడం జరిగింది. ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకువచ్చేందుకు ఈసందర్భంగా తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆలయాన్ని పచ్చదనంతో నింపేందుకు ఈ మొక్కల పంపిణీ ఎంతగానో దోహద పడుతుందన్నారు.

## అభవృద్ధి నిరోధకులు ప్రతిపక్షాలు

రోలుగుంటః జె.నాయుడుపాలెంలో బాలికల వసతి గృహం నిర్మాణానికి సంబంధించి శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై గ్రామ టీడీపీ అధ్యక్షులు కిల్లాడ సన్యాసినాయుడు అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా శిలాఫలకాన్ని యధావిధిగా అదే ప్రాంతంలో అమర్చారు. దీనిపై సన్యాసినాయుడు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిపక్ష పార్టీ నాయకులు కావాలనే ఇటువంటి పనులకు పాల్పడుతున్నారన్నారు. మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

# సమస్యల పరిష్కారమే గ్రామదర్శిని ధ్యేయం



నాతవరంః సమస్యల పరిష్కారమే గ్రామదర్శిని యొక్క ముఖ్య ధ్యేయమని నాతవరం ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు అన్నారు. శుక్రవారం చమ్మచింత పంచాయతీ పిఎన్‌డిపాలెం గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం జరిగింది. ముందుగా గ్రామంలో పర్యటించి అంగన్వాడీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామదర్శినిలో గ్రామస్థులు తమ సమస్యలను తెలియజేశారు. ఐదు నెలలుగా పాఠశాలను మూసివేశారని, వెంటనే స్కూల్ మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. గ్రామంలో సిసి రోడ్డు వేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతున్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమస్యలను పరిష్కారం కోసమే గ్రామదర్శి చేపట్టామన్నారు. సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధికారులు, ఎంపిటిపి నూకరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చెట్ల కూల్చివేతపై కేసు

యలమంచిలి రూరల్ః మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో ప్రభుత్వ భూమిలో చెట్లు కూల్చివేసిన ఘటనకు సంబంధించి స్థానిక రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తహశీల్దార్ వై.అప్పలరాజు ఫిర్యాదు మేరకు పెదపల్లికి చెందిన పోతుల చిన్నోడు, బద్దపు సత్తిబాబులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. గ్రామంలో సర్వే నెంబరూ362లో ఉన్న ప్రభుత్వ భూమిలో నీరు చెట్టు కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు, కొన్ని తాటిచెట్లను నిందితులు జేసిబితో ఈ నెల 16న కూల్చివేశారు. దీనిపై ఆరా తీసిన రెవెన్యూ అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

రావికమతంః మండలంలోని కళ్యాణపులోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ కె.రమాదేవి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనగెడ్డ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. గెడ్డ నుంచి ఇసుక తరలిపోకుండా రెవెన్యూ సిబ్బంది, పోలీసులను కాపలా ఉంచామన్నారు. గెడ్డ నుంచే వెళ్లే రహదారిలో ట్రెంచ్‌లు తవ్విస్తామని చెప్పారు.



**భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 93వ జయంతి సందర్భంగా స్థానిక జివిఎంసి 17వ వార్డు పెదవాల్తేరునందు నిరాశ్రయుల వసతి గృహంలో పట్టా ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం దోమతెరల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి బైరెడ్డి పోతన్నరెడ్డి అందజేశారు. బాబా భక్తులు, సమాజ సభ్యులు, గ్రామపెద్దలైన చిల్లా రామారావు, పలికెల నీలరెడ్డి, గొర్లె దేముడుబాబు, తదితరులు పాల్గొన్నారు.**

# అంటువ్యాధుల నివారణకు ఖచ్చితమైన రోగనిర్ధారణ పరీక్షలు

## గీతం ‘వర్సిటీలో సి.ఎస్.ఐ.ఆర్.డైరక్టర్ జనరల్



విశాఖపట్నం : అంటు వ్యాధుల నివారణకు ఖచ్చితమైన రోగనిర్ధారణ పరీక్షలు, సరిఅయిన చికిత్సా విధానం అవసరమని ముఖ్యంగా చికిత్స సమయంలో వైద్యులు సూచించిన విధంగా రోగం తగ్గినా ఔషధి వినియోగ కాలాన్ని (డోసేజ్) ను పూర్తిగా అనుసరించి తీరాల్సిందేనని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ ఇండస్ట్రియల్ రీసెర్చి (సి.ఎస్.ఐ.ఆర్) డైరక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్ సి.మండే పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో ప్రారంభం అయిన ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమి వర్క్‌షాప్‌ను ఆయన ముఖ్యఅతిధిగా హజరై ప్రారంభించారు. అంటువ్యాధుల గూర్చి ఆయన ప్రస్తావిస్తూ భారత దేశంలోని అత్యధిక శాతం మంది జనాభాలో టిబి అంతర్గతంగా ఉంటుందని, దీనికి ఔషధాన్ని తయారు చేయడం నేటికీ కష్ట సాద్యంగా ఉందన్నారు. టిబి మరణాలకు కారణం తెలియని విధంగా ఉండటం శాస్త్రవేత్తలు రోగ నిర్ధారణ, చికిత్సపై నేటి పరిశోధనలకు పురిగొల్పుతోందని తెలిపారు. కార్యక్రమానికి అద్యక్షత వహించిన గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ సైన్స్, ఫార్మశీ, ఇజనీరింగ్, వైద్య రంగాలను వేరుచేసి చూడకూడదని ఒక దానితో మరొకటి అవినాభావ సంబంధం ఉంటుందన్నారు.ప్రాథమిక శాస్త్ర విజ్ఞానాన్ని అర్ధం చేసుకుని ప్రోత్సహించడం ద్వారా అప్లయిడ్ సైన్స్ బలోపేతం కాగలదన్నారు.అంతర్ విభాగ పరిశోధనలపై గీతం దృష్టి సారిస్తుందన్నారు.

కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ బి.రవీంద్రన్, డెంగూ వేక్సిన్ పరిశోధక శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ ఖన్నా, హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిశోధకు రాలు ప్రొఫెసర్ శర్మిష్ఠ బెనర్జీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అరుణ లక్ష్మీ, వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ అనిత పాల్గొని ప్రసంగించారు.

# నాల్గవ రోజుకు చేరుకున్న పాఠశాల కాంట్రాక్ట్ కార్మికుల దీక్షలు

## - బాధితులకు అండగా ఉంటాం - జనసేన నాయకుడు కొణతాల సీతారాం



అనకాపల్లి : 8 నెలల బకాయిలు చెల్లించాలని, తమ పనుల్లో కొత్తవారిని కాకుండా తమన కొనసాగించాలి డిమాండ్ చేస్తూ జివిఎంసీ పాఠశాలల కాంట్రాక్టు పారిశుధ్య చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. కాగా నాల్గవ రోజు దీక్ష శిబిరాన్ని జనసేన నాయకుడు కొణతాల సీతారామ్ సందర్శించి తన సంఘీభావాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పారిశుద్య కార్మికులుగా గత కొన్ని సంవత్సరాలుగా అతి తక్కువ వేతనంలో పనిచేస్తున్న కార్మికులు ఆశ వేతనాలతోటి బ్లీచింగ్ ఫౌండర్, పినాయిల్ తదితర పనిముట్ల సమకూర్చుకునేవారని జీవిఎంసీలో విలీనం అయ్యాక వీరి వేతనం ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికులను మనుషులుగా చూడడం లేదని వాళ్ల ఇచ్చే 4 వేల జీతాన్ని కూడా సకాలంలో చెల్లించకుండా బకాయిలు పడితే ఎలా బ్రతకుతారని ప్రశ్నించారు. తక్షణమే జోలన్ కమీషనర్ స్పందించి వాళ్ల జీతాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. అలాగే పనిభద్రత లేని వీళ్లందరికీ పని కల్పించేలా చేయాలని కోరారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం సిపిఐ పార్టీలో కలిసి జనసేన కూడా తోడుగా ఉంటుందని ఉద్యమం చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు మళ్ల సత్యనారాయణ, ఎ. బాలకృష్ణ, మహిళ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# రైతుని మోసము చేసిన వామపక్ష నేత



భీమునిపట్నం : భీమిలి మండలం బోడమెట్ట పాలెం లో నివసిస్తున్న నిరక్షరాస్యుడు బాడిదిబోయిన. నరిసింహులు, కు పిత్రీయముగా బోడమెట్ట పాలెం గ్రామం సర్వే నెం 38/8,39/11 నెంబర్లలో సుమారు య.1.86 శెంట్లు మెట్టు భూమి ని అమ్మడానికి ప్రముఖ సి.పి.నేత ఆర్ ఎస్.ఎస్ మూర్తి మధ్యవర్తిగా వుండి సదరు భూమి రిజిస్ట్రేషన్ కొరకు పట్టాదారుపాసుపుస్తకాలు లేవని వాటిని చేయడానికి ఆఫీస్ ఖర్చులు నిమిత్తం మూడు లక్షలు ఇచ్చామని నరిసింహులు తెలిపారు. కొద్ది కాలం తరువాత అ డబ్బులు తహసిల్దార్ కి ఇచ్చామని ఆయన ఎ సి.బి కి దొరికి పోయనందున ఆ సొమ్ము పోయాయని నమ్మించాడు తరువాత రైతు దగ్గర పురోణి రాయించుకొని టి.డి.పి నాయకుని వేరొకరికి ఆ భూమి విక్రయించి పది లక్షల నగదు రూపం లో మిగతా మొత్తాన్ని తొమ్మిది చెక్కుల రూపం లో నరిసింహులు ఇచ్చారు పాస్ పుస్తకాలు తన వద్ద ఉంచుతానని నమ్మించిన నాయుకుడు వారిని బుట్టలో వేసుకున్నాడు తరువాత బాదిత రైతు నాయుకుడిని కలవగా బ్యాంకు లో ఉన్న సొమ్ములో అరవై వేలు ఇన్ కామ్ టాక్స్ కింద కట్ అయ్యాయని చెప్పారు.అప్పటికే మోస పోయామని తెలుసుకున్న బాధితులు బ్యాంకు వెళ్లి విచారించగా అరవై ఆరువేలు మాత్రమే ఉండడం తో తన ఖాతానుంచి మదురవాడకు చెందిన ఒక వ్యక్తికి మూడు లక్షలు డి డి రూపంలో బదిలీ అయ్యాయని,మల్లి 2.38 లక్షలు వచ్చి చేరిందని తమ కు తెలియకుండా అనేక సారులు తమ ఖాత నుంచి డబ్బులు డ్రా అయ్యాయని గుర్తించారు ఈ విషయం లో బ్యాంకు సిబ్బంది నాయుకుని సహకరించి ఉండ వచ్చని నరసింహులు అనుమానం వ్యక్తం చేశారు.జరిగిన విత్ డ్రాలు వలన తాను 19.50 లక్షలు నష్ట పోయాయని భూమి కొనుగోలు దారుడు ఇచ్చిన చెక్కులు తమ ప్రమేయం లేకుండా విత్ డ్రా అయిన మొత్తం విచారణ జరిపించాలని ఇచ్చిన పిర్యాదు లో పేర్కొన్నారు. విచారణ జరిపి చర్యలు తీ సుకుంటామని ఎస్.ఐ శ్రీను తెలిపారు.

# 40వ వార్డు సిఓను తక్షణం తొలగించాలి

## జివియంసి వార్డు కార్యాలయం ఆవరణలో నిరసనకు దిగిన డ్వాక్రా మహిళలు

## ఆర్ పిల ఎంపికను అడ్డుకున్న డ్వాక్రా మహిళలు

విశాఖపట్నం: జీవీఎంసీ 40 వ వార్డు పరిది లో విదులు నిర్వహిస్తున్న సి.ఓ ను తక్షణం తొలగించాలని కోరుతూ జీవీఎంసీ వార్డు కార్యలయం ఆవరణలో శుక్రవారం ఉదయం డ్వాక్ర మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు . ఈమేరకు వార్డు కార్యలయంలో జీవీఎంసీ జోన్ -4 అసిస్టెంట్ పి .ఓ చిట్టిబాబు నేతృత్వంలో ఆర్ .పి ల ఎంపిక చేపట్టడంతో వారు అడ్డుకున్నారు . ఇవిషయమై వార్డు మాజీ కార్పొరేటర్ పాలమర శెట్టి నర్శకుమారి దృష్టికి తీసుకు వెల్లడంతో స్పందించిన ఆమే అక్కడికి చేరుకుని ఆరోపణలు ఎదుర్కుంటున్న ఆర్ .పి లను ఎలా ఎన్నుకుంటారని ఎ .పి.డి ని ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్ .పి ల్లో కొంతమంది ఆర్ .పి లు డ్వాక్ర రుణాల మంజూరులో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఇవిశమై ఇప్పటికే జీవీఎంసీ పి.డి కి పిర్యాదు చేయడం జరిగిందని స్పందించిన ఆయన జీవీఎంసీ అధికారిచే డ్వాక్ర గ్రూప్ సభ్యులతో నేరుగా సమావేశమై వాస్తవాలను పరిశీలించి అవకతవకలు జరిగినట్లు గుర్తించి పి.డి కి నివేదిక సమర్పించారని అన్నారు. నివేదికను పరిశీలించిన పి.డి అవకతవకలకు పాల్పడ్డ ఆర్ .పి లను తొలగించి డ్వాక్ర గ్రూప్ సభ్యులు నూతనంగా ఎన్నుకోబడ్డ ఆర్ .పి లను నియమిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.

అయితే అలాకాకుండా డ్వాక్ర మహిళలచే సమావేశం నిర్వహించి తిరిగి ఆరోపణలు ఎదుర్కుంటున్న ఆర్ .పి లను నియమించటం పై అనుమానం వ్యక్తం చేశారు. వార్డు లో సుమారు 300 డ్వాక్ర గ్రూప్ లు వుండగా 10 ఎస్ .ఎల్ .ఎఫ్ , లు వుండగా 10 ఎస్ .ఎల్ .ఎఫ్ , 10 మంది ఆర్ .పి లు సేవలందిస్తున్నారని 300 డ్వాక్ర గ్రూపు లు 10 ఎస్ .ఎల్ .ఎఫ్ లకు సమాంతరంగా కేటాయించాల్సి ఉన్న సి.ఓ తనకు అనుకూలంగా వున్నా ఎస్ .ఎల్ .ఎఫ్ ఆర్ .పి లకు ఎక్కువ గ్రూపులు కేటాయించారని అదేవిదంగా వార్డు సి.ఓ డ్వాక్ర రుణాలు మంజూరు చేయాడానికి డబ్బలు డిమాండ్ చేసారని ఆరోపించిన ఆమే డ్వాక్ర మహిళలకు రుణ మాఫీ కింద అందించే పసుపు కుంకుమ రుణాలకు సంబందించి దస్త్రాలపై సంతకం చేసేందుకూ నెలలు తరబడి కార్యలయం చుట్టూ సి.ఓ తిప్పు తున్నారని డ్వాక్ర మహిళలు మండి పడుతున్నారు. అలాగే పేద , మద్య తరగతి మహిళలకు అండగ ఉండి స్వయం వృతి పోత్సాహకం అందించేందు ప్రభుత్వం డ్వాక్ర గ్రూపు లు ఏర్పాటు చేస్తే అందులో పలు ప్రభుత్వ శాఖల్లో విదులు నిర్వహిస్తున్న ఉద్యోగుల భార్యలు డ్వాక్ర గ్రూపుల్లో ఉండి ప్రభుత్వం తక్కువ వడ్డీ కి అందిస్తున్న రుణాలను పొందుతున్నారని అటువంటి వారిని గుర్తించి తొలగించాల్సి ఉన్న సి.ఓ వారికి పరోక్షంగా సహకరించి రుణాలు అందిస్తున్నారని డ్వాక్ర మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటి కైనా వార్డు సి.ఓ ను తొలగించి డ్వాక్ర మహిళలు ఎన్నుకోబడ్డ ఆర్‌పి లను నియమించాలని డ్వాక్ర మహిళలు కోరుతున్నారు.

# రోడ్డు పనులకు శంకుస్థాపన

రోలుగుంట : ఎంకె.పట్నం నుండి బిబి.పట్నం మీదుగా వెళ్లే రహదారి రత్నంపేటకు రూ.2కోట్లు మంజూరైన రోడ్డు నిర్మాణానికి శుక్రవారం చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ మారుమూల గ్రామాల సైతం రోడ్డు వేసిన ఘనత టీడీపీ పభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి, మండల సీనియర్ నాయకులు గండి సింహాద్రి, జెడ్‌పిటిసి మెంబరు లక్ష్మి, ఎంకె.పట్నం టిడిపి నాయకులు మడ్డునాయుడు, ఎంపిటిసి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఫార్మసి వారోత్సవాల సందర్భంగా విద్యార్ధులు మెగా ర్యాలీ




భీమునిపట్నం : తగరపువలస అవంతీ ఫార్మసి కళాశాలలో ఈ నెల 18 నుండి 24 వరకూ ఏడురోజులు పాటు జరిగే జాతీయ ఫార్మసి వారోత్సవాల సందర్భంగా ఫార్మసిస్ట్ ఫర్ హెల్దీ ఇండియా అనే నినాదం తో స్థానిక భీమిలి వీధులలో విద్యార్థులు ఉపాధ్యాయులు మేగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల శారీరక ఆరో గ్యాన్ని పెంపొందించుటకు క్రీడలపై అవగాహన కలిప్పించడమే కాకుండా విద్యార్థుల మధ్య ఆవశ్యకతను పెంచుటకు క్రీడా పోటీలు నిర్వహించారు .అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.బి.వి.రాజు తెలిపారు.ఈ కార్యక్రమం లో కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎం.ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, వైస్ ప్రేసిడేంట్ ఎం.వి.ఎస్.ఎస్.నందిని,డైరెక్టర్ డాక్టర్.ఎ.చంద్రశేఖర్,వి.ప్రసాద్ లు పాల్గొన్నారు.డిసెంబర్ ఒకటిన ఎపొదిక్ 2ఎ 18 నినాదంతో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# విజయభాను

## సంపాదకీయం

### కశ్మీర్ నాటకం

గవర్నర్ సత్యపాల్ మాలిక్ బుధవారం జమ్మూకశ్మీర్ శాసనసభను రద్దుచేయడంతో కొంతకాలంగా సాగుతున్న తెరవెనుక నాటకాలకు ముగింపు వచ్చింది. గవర్నర్ శాసనసభను రద్దు చేయడం అనివార్య చర్యగా కనిపిస్తున్నప్పటికీ కశ్మీర్‌లో బాధ్యతాయుత ప్రభుత్వం నిలువలేక పోవడం ఆందోళనకరం. తీవ్రవాదం మూలంగా సంక్షుభితమై ఉన్న జమ్మూకశ్మీర్‌లో రాజకీయ పార్టీలు, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏ మాత్రం బాధ్యతాయుతంగా లేదు. ఈ మొత్తం ఉదంతంలో బీజేపీ నిర్వహించిన పాత్ర మరీ అభ్యంతరకరంగా ఉన్నది. జాతీయ పార్టీగానే కాకుండా, కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయపక్షంగా బీజేపీ బాధ్యతాయుతంగా వ్యవహరించవలసింది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మొత్తం స్థానాలు 87 కాగా ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి కనీసం 44 మంది సభ్యుల బలం అవసరం. కానీ బీజేపీకి ఉన్నది 25 మంది సభ్యులు. పీపుల్స్ కాన్ఫరెన్స్ నాయకుడు సజ్జాద్ లోనె చేత ప్రభుత్వం ఏర్పాటు చేయించడానికి రంగం సిద్ధం చేసింది. ఇంతకూ పీపుల్స్ కాన్ఫరెన్స్ పార్టీకున్న బలం ఎంత? ఆ పార్టీకి ఉన్నది సజ్జాద్ లోనెతో పాటు మరొక సభ్యుడు మాత్రమే. ఇద్దరు సభ్యులు గల పీపుల్స్ కాన్ఫరెన్స్‌కు బీజేపీ మద్దతు ఇచ్చినా మొత్తం బలం 27కు మించదు. పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్‌ల నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా మిగితా సభ్యులను కూడగట్టడమే బీజేపీ ఎత్తుగడ. ఈ పరిస్థితిని గమనించి అప్రమత్తమైన పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ ఏకతాటిపైకి వచ్చి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి సిద్ధపడ్డాయి. పీడీపీకి 28 మంది, నేషనల్ కాన్ఫరెన్స్ కు 15 మంది, కాంగ్రెస్‌కు 12 మంది సభ్యులున్నారు. వీరు కలిస్తే మెజార్టీ లభిస్తుంది. మిగి తా పార్టీలు ఏకతాటి పైకి రావడంతో గవర్నర్ వెంటనే శాసనసభను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కశ్మీర్ లోయలో ప్రాబల్యం కోసం పోటీ పడే పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఏకతాటిపైకి రావ డం ఆశ్చర్యకరమే. కానీ బీజేపీ ఉధ ృతిని తట్టుకోవడానికి ఏకం కాక తప్పలేదు. ఇప్పటికే పీడీపీకి చెందిన సీనియర్ నాయకులను బీజేపీ తమవైపు తిప్పుకున్నది. ఆలస్యమైతే తమ పార్టీ చీలిపోతుందని పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీ గ్రహించారు. నేషనల్ కాన్ఫరెన్స్ పరిస్థితీ ఇదే. అందుకనే పైకి ఎవరు ఏమంటున్నప్పటికీ గవర్నర్ శాసనసభను రద్దు చేయడం పట్ల అన్ని పక్షాలు సంతోషించే పరిస్థితి ఏర్పడ్డది. తమ పార్టీ కాకుండా, ప్రత్యర్థులు అధికారం చేపట్టడం బీజేపీకి ఇష్టం లేదు. రాజకీయ నాయకురాలిగా ఇంకా పరిణతి పొందని మెహబూబా ముఫ్తీ తన పార్టీ సభ్యులను కాపాడుకోలేకపోతున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకొన్నందుకు పీడీపీ అపఖ్యాతిపాలైనందున, ఎన్నికలు జరిగితే కశ్మీర్ లోయ లో తమ బలం పెరుగుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా భావిస్తున్నారు. జమ్మూ లో కాంగ్రెస్‌ను దెబ్బతీసి బీజేపీ పుంజుకున్నది. మళ్ళా ఎన్నికలు జరిగితే తాము బలపడకపోతామా అనే ఆశ కాంగ్రెస్‌కు మిణుకుమిణుకు మంటున్నది. అన్ని రాజకీయపార్టీలు తమ ప్రయోజనాల గురించి ఆలోచిస్తున్నాయే తప్ప అల్లకల్లోలంగా ఉన్న కశ్మీర్‌లోయలో శాంతి నెలకొల్పడం ఎట్లా అనేది పట్టించుకోవడం లేదు. జూన్ 19న మొదలైన గవర్నర్ పాలన డిసెంబర్ 18తో ముగుస్తున్న దశలో రాజకీయపక్షాలు రాష్ట్ర భవిష్యత్తు గురించి చర్చ ప్రారంభిస్తే బాగుండేది. కానీ ఈ పార్టీల బాధ్యతారాహిత్యం వల్ల కశ్మీర్ లోయలో ప్రజాప్రభుత్వం అనేది లేకుండా పోయింది. రాష్ట్ర శాసనసభను రద్దుచేయడానికి గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెబుతున్న కారణాలు సహేతుకంగా కనిపించడం లేదు. విరుద్ధ భావజాలాలు గల రాజకీయ పార్టీలు ఒకటి కావడం సుస్థిర ప్రభుత్వం ఏర్పడటం అసాధ్యమని భావించినట్టు గవర్నర్ వివరించారు. బాధ్యతాయుత ప్రభు త్వం ఏర్పాటుచేయడానికి కాకుండా, అధికారం చేపట్టడానికే ఇటువంటి (భావసారూప్యం లేని) పార్టీలు ఏకమవుతున్నాయని గవర్నర్ అభిప్రాయపడ్డారు. విరుద్ధ భావాలు గల శాసనసభ్యుల మద్దతు కూడగట్టడానికి బేరసారాలు జరిగే అవకాశముందని, అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని గవర్నర్ వివరించారు. భిన్నపక్షాలకు మెజార్టీ ఉందని పేర్కొనడం వల్ల ఈ పార్టీల కలయిక ఎంతకాలం ఉంటుందనే అనుమానాలున్నాయని కూడా గవర్నర్ పేర్కొన్నారు. నిజానికి గవర్నర్ చెబుతున్న కారణాలు అన్నీ ఆయన సొంత అభిప్రాయాలు, అంచనాలు మాత్రమే. వీటిని పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో శాసనసభ రద్దుకు సరైన కారణాలుగా భావించలేము. విరుద్ధ భావజాలాలు గల పార్టీలు ఏకతాటిపైకి రావడంలో తప్పేమీ లేదు.

# సబ్ జైలులో రొట్టెలు పంపిణీ



అనకాపల్లి : అక్కినేని నాగచైతన్య జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్తరాంధ్ర నాగార్జున ఫ్యాన్స్ అధ్యక్షులు మళ్ల సురేంద్ర ఆద్వర్యంలో పలు చోట్ల ఈ వేడుకలు నిర్వహించారు. ముందుగా విశాఖపట్నంలో ఉన్న, నాగచైతన్యను కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం అనకాపల్లిలోని సబ్ జైలులో ఖైదీలకు పండ్లు, రొట్టెలు అందజేసారు. ఈసందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ అభిమానులు సేవా కార్యక్రమాల ద్వారా తమ అభిమాన హీరోపై, ప్రేమను చూపించుకోవాలన్నారు. ఆడంబరాలకు పోకుండా, పేదలకు సేవ చేసినప్పుడే తమ అభిమాన నేతలకు నిజమైన శుభాక్షాంక్షలు తెలియ జేసినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినేని అభిమానులు, మద్దాల వీరునాయుడు, గోల్డ్ వాసు, విజయ్, సూపరిడెంట్ ఒమ్మి అప్పలనారాయణ, రియాద్, సురేష్, కిరణ్, బాను, దొర, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత సామాజిక బాధ్యత: పురపాలక చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ

విజయనగరం : స్వచ్ఛత అనేది ఒక సామాజిక బాధ్యతని, దీనిని ప్రజలందరూ అలవాటు చేసుకోవాలని పురపాలక చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్-2019లో భాగంగా శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయం నుండి కోట జంక్షన్ వరకు స్వచ్ఛ ర్యాలీని నిర్వహించారు. పురపాలక కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ మహాత్ముని స్ఫూర్తితో ప్రతీఒక్కరూ స్వచ్ఛ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ తడి, పొడి చెత్తలను వేరుచేసి పురపాలక వాహనాలను అందజేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయడం నేరమని, మరుగుదొడ్లు తప్పకుండా నిర్మించుకోవాలని పేర్కొన్నారు.

పురపాలక సంఘం తరపున ప్రతీ ఇంటిలో మరుగుదొడ్డి ఉండేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే అవసరమైనచోట సామూహిక మరుగుదొడ్లను నిర్మించామన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వారి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం వచ్చిందన్నారు. మన వీధిని మనం శుభ్రంగా ఉంచుకోవాలనే బాధ్యత ప్రజల్లో కనబడుతోందన్నారు. పురపాలక సంఘం తరపున పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుదలకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ప్రజలందరూ పారిశుద్ధ్యం మెరుగుదలకు పురపాలక సంఘానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజలందరూ స్వచ్ఛ సర్వేక్షణ్-2019లో పాల్గొని విజయనగరం పురపాలక సంఘానికి మెరుగైన ర్యాంకు వచ్చే విధంగా సహకరించాలన్నారు. ప్రతీఒక్కరూ స్వచ్ఛతా యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని వారు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సూచించారు. అలాగే పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూళనకు ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డా.దీపక్, పురపాలక పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది, పలుస్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 242 పోలింగ్ కేంద్రాలు సిద్ధం

### - తహసీల్దార్ వై. అప్పలరాజు



యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గం పరిధిలో రానున్న సార్వత్రిక ఎన్నికలకు 242 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ వై. అప్పలరాజు తెలిపారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ నియోజకవర్గం పరిధిలో 227 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 16 కేంద్రాలు పెరిగాయని తెలిపారు. దీంతో మొత్తం 242 కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. యలమంచిలి మండలంలో 2, రాంబిల్లిలో 4, అచ్చుతాపురంలో 9, మునగపాకలో ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు పెరిగానట్టు వెల్లడించారు. ఓటర్ల జాబితాల సవరణకు ముందు నియోజకవర్గ పరిధిలో 1,83,089 ఓటర్లు ఉండగా కొత్తగా ఓటరు నమోదు కోసం 1797 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ అక్టోబర్ 31తో ముగిసిందన్నారు.

# వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన

### సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.జయ ప్రకాష్

నర్సీపట్నం : సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.జయప్రకాష్ అన్నారు. శుక్రవారం నర్సీపట్నం బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థినుల పరిజ్ఞానాన్ని తెలుసుకొని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థి నుద్దేశించి మాట్లాడారు. చదువు ద్వారానే విజ్ఞానం వస్తుందన్నారు. విజ్ఞానం ద్వారా సంపద లభిస్తుందని ఆయన విద్యార్థులకు బోధించారు. వసతి గృహాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మరమ్మత్తులకు గురైన వసతి గృహాలను మరమ్మత్తులు చేయిస్తామన్నారు. ఈయన వెంట వసతి గృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న జయప్రకాష్

## దారమఠంలో ప్రత్యేక పూజలు

గొలుగొండ : దారమఠం దారమల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు దారమఠం ఆలయ ప్రాంగణంలో గల జలపాతంలో స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గన్నారు. గొలుగొండ, జోగుంపేట, చోద్యం, లింగంపేట, కొత్తమల్లంపేట, అమ్మపేట, చీడిగుమ్మల, పాకలపాడు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజఒమ్మంగి, లబ్బర్తి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వన భోజనాలు చేశారు.

## కవి సమయం

### 'వాత్సల్యం'

ఒళ్లు పులకరించేద
గుండె జల్దరించేద
నాడిచల్లబడేయద
కాళ్లు-చేతులు వణుకుచుండేద
అణువణువులో దాగి ఉన్న ప్రాణం
అరపాదాలకు ఏరేద
మాతా!.. పితా! మరణవార్త
పిడుగుపాటు అయ్యేద ...'ఒళ్లు'
నోరు మెదపకుండద
కన్నీళ్లు జారకుండద
కోళ్లన్ని కుప్పకూలిపోవద
పున్నమి నరకం నుండి తప్పించుటకై;
తలకొరవని-చితిని నిప్పంటించుటకై
చేతులేలా వచ్చెద
ఆ, హృదయం- ఎంత వికారం చెందేద
...'ఒళ్లు'
పకృతి వలయంలో
మాతృమూర్తుల ప్రాణాలను
హరించుకుపోయే యముడ్ని

ఏడి-ఎక్కడని రౌద్రం చెందెద
ఎంత దైవస్మరణ ఉండునో!
మాతా!...పితా వియోగం చెందేకా!
అంత దైవస్మరణను కోల్పోయద
ఆ, మతకను - మైమరిచేది
దశ దిశాలా! .. సంవత్సరికాలా
ఎన్నాళ్లు - ఎన్నేళ్లు!
ఏ మాతృమూర్తిని చూసి అమ్మా! అని
వాపోయద
ఏ పితృమూర్తుడి చూసి నాన్నా! అని
భ్రమపడియద
అస్తమించే, ఆశీరోరలపై
గుర్తు - మచ్చలు పెట్టాం
ఉదయ కిరణమై - మా ఉదరంలో
ఉదయిస్తే- మీ పేర్లు పెట్టుకుంటాం
...'ఒళ్లు'

... కవితా రచన
యల్.సిద్ధు
సెల్ నెం:9493531285

# పంచాంగం

మాసం : కార్తీక; తిథి : పాడ్యమి ఉ.10.28; రోహిణి సా.5.27; ఉ.వ.9.39ల 11.12; రా.వ.10.48ల 12.20.

శనివారం 24-11-2018

a **మేషం** : విదేశీ వస్తువులు సేకరిస్తారు. నిరు ద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. దూరపు బంధువులు కలుసుకుంటారు. విందు, వినోద కార్యకలాపాలలో పాల్గొంటారు. అసాధ్యమనుకున్న పనులు సునాయసంగా పూర్తిచేస్తారు.

b **వృషభం** : ఉన్న విద్యా విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళలు, రాజకీయ , న్యాయ రంగాల, వారికి శుభప్రదం. రవాణా, ఎగుమతులు, దిగుమతులు, విదేశీ వ్యవహారాల రంగాల వారికి ప్రోత్సాహకరం.వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి.

c **మిథునం** : సినీ, రాజకీయ, ప్రభుత్వ రంగాల వారికి ప్రోత్సామకరంగా ఉంటుంది. పై అధికారుల ప్రోత్సాహంతో లక్ష్య సాధనకు ప్రయత్నిస్తారు. కుటుంబ పెద్దల విషయంలో శుభపరిణామాలు సంభవం. ఆర్థిక లాభం.

d **కర్కాటకం** : రుణయత్నాలు మాత్రమే ముందుకు సాగుతాయి. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు.ఆర్థిక సంస్థలలో పనులు పూర్తి అగును. పెండింగ్ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. చిన్న తరహా పరిశ్రమల్లో పనిచేసిన వారికి అధికారుల మన్నలనలు పొందుతారు. ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయి. కళారంగం వారికి లాభం.

e **సింహం** : స్నేహ బంధాలుల మెరుగుపడతాయి. పట్టుదలతో శ్రమించి లక్ష్యాలు సాధిస్తారు. స్నేహితుల అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకుంటారు. వాటి వలన సత్ఫలితాలు లభిస్తాయి. వ్యాపారస్థులకు లాభం. ఇప్పటివరకు విరోధులుగా ఉన్న వ్యక్తలను సుముఖం చేసుకోగలుగుతారు. ప్రేమికులు పెద్దల ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది.

f **కన్య** : శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసాన్ని కలిగిస్తుంది. బ్యాంకింగ్, చిట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. ఎవరికైనా ధన సహాయం చేసినా తిరిగిరాజాలదు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి గుర్తింపు లభిస్తుంది. చిన్నారుల, ఖరీదైన వస్తువుల కొనుగోలు విషయంలో ఖర్చులు అంచనాలను మించుతాయి. ఉమ్మడిగా చేసిన వ్యాపార లావాదేవీలు లాభసాటిగా ఉంటాయి.

g **తుల** : ప్రయాణాలు అనుకూలంఅ సాగును. విలువైన వస్తువులు కొంటారు. ఆరోగ్యం జాగ్రత్త. ఖర్చులు అధికంగా ఉంటాయి. దూర ప్రయానాలు కలిసివస్తాయి. పాత బాకీలు వసూలు అగును. ముఖ్య సమాచారం అందుతుంది. ఉద్యోగస్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారిస్తారు. ఆలయాలను సందర్శిస్తారు.

h **వృశ్చికం** : ఆర్థిక కుటుంబ విషయాలపట్ల దృష్టి సాగిస్తారు. బ్యాంకింగ్, చిట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. ఆలయాలను సందర్శిస్తారు. ఉద్యోగస్తులు అధికారులతో మాటపడకుండా తగిన జాగ్రత్త వహించండి. కొబ్బరి, పండ్లు, పూలు, పానియ వ్యాపారులకు కలిసివస్తుంది.

i **ధనుస్సు** : తొందరపాటుతనం వల్ల కుటుంబీకులు, అవతలి వారితో మాటపడవలసి వస్తుంది. స్త్రీలు వీలైనంత వరకు మితంగా సంభాషించడం మేలు. ఖర్చులు అధికమవుతాయి. హోటల్, తినుబండారాలు, బేకరీ పనివారులకు లాభదాయకంగా ఉంటుంది. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

j **మకరం** : సిమెంటు, కలప, ఐరన్, ఇటుక వ్యాపారుకు మిశ్రమ ఫలితం. స్త్రీలకు కాళ్ళు, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కొంటారు. వైద్య, ఇంజనీరింగ్ రంగంలోని వారికి ఏకాగ్రత ఎంతో ముఖ్యం, పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది.

k **కుంభం** : ఆరోగ్య విషయంలో జాగ్రత్త, ఔషధ సేవ చేస్తారు. కీళ్ల నొప్పులు ఉదర సంబంధిత వ్యాదులు మిమ్మల్ని కలవరపెడతాయి. ఖర్చులు అధికకం. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు సన్నిహితుల వలనలాభం.

L **మీనం** : గంతలో మీరు చేసిన కృషి ఫలిస్తుంది. రచనరంగంలో ఉన్నవారికి మంచి ప్రోత్సాహకరంగా ఉంటుంది. జాయింట్‌గా వ్యాపార సంస్థలు నడుపు వారికి లాభదాయకంగా ఉంటుంది. కాంట్రాక్టర్లకు నూతన అగ్రిమెంట్లు కలిసి వస్తాయి ఆర్థికంగా లాభం, ఆరోగ్యం జాగ్రత్త. మీ ఉన్నతిని చాటుకోవడం కోసం ధనం బాగా ఖర్చు చేస్తారు.

# సన్మార్గమే నిర్దేశం కావాలి



**నిర్దేశం** అనే పదానికి చూపించు, ఆజ్ఞాపించు, సూచించు అని అర్థాలున్నాయి. నిర్దేశకుడు అంటే ఆజ్ఞాపించువాడు, చూపించువాడని అర్థం. దేనిని చూపాలి? ఏం ఆజ్ఞాపించాలి..? అనేవి ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. గీతలో అర్జును డికి మార్గోపదేశం చేయడంతో పాటు తానే మార్గ నిర్దేశం అయ్యాడు కృష్ణ భగవానుడు. ఈ జగత్తులో ప్రతి మానవుడు తాను జీవించే విధానం లేదా కర్మల ద్వారా సమాజాన్ని ప్రేరేపిస్తుం టాడు.

కొందరు రచనల ద్వారా, మరికొందరు కళల ద్వారా, ఇంకొందరు వృత్తిద్వారా మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నారు. ప్రకృతిలోని ఇతర జీవరాశులు సైతం తమదైన శైలిలో మార్గనిర్దేశం చేస్తుంటాయి.

సత్యయుగంలో మానవులు షోడష కళలతో సర్వ శ్రేష్టంగా జీవించేలా దేవతలు మార్గనిర్దేశం చేశారు. త్రేతాయుగంలో సైతం మానవులు గౌరవం, సోదరభావంతో మెలుగుతూ సామాజిక విలువలను ఉన్నతపథంలో నిలిపారు. ద్వాపర యుగంలో భక్తిమార్గం సమాజానికి సరైన దిశా నిర్దేశం చేసింది. రుషులు, మునులు, తపోధ నులు.. పరమాత్ముడి గుణగణాలను తెలియజేస్తూ ఎన్నో కావ్యాలను వెలువరించారు. ధర్మగ్రంథాలుగా ప్రాచుర్యం పొందిన ఈ కావ్యాలు నేటికి సామాన్య మానవులకు సైతం మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

సాంఘిక జీవనంలో భాగంగా ఉన్న మనం.. ఆ సమాజానికి కీడు తలచడం సరికాదు. ప్రాణికోటి శుభం కోరే పరమాత్ముడి సంతానంగా ఉన్న మనం.. అశుభం కోరడం సమంజసం కాదు. ఎన్ని కష్టాలు ఉన్నా.. మనసా, వాచా, కర్మణా మంచినే కోరాలి. పరమ శివుడు నిర్దేశించిన శ్రీమతం ద్వారా సర్వ సమాజానికి అంతా మంచే జరుగుతుంది. మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యలు యుద్ధంలాంటివైతే.. వాటిని ఎలా గెలువగలమో నిర్దేశిస్తూ మరొకరికి మార్గదర్శనం చేయాలి. పలాయనవాదులను చరిత్ర అసమర్థులుగా తేల్చి చెప్పింది. కష్టనష్టాలకోర్చి ముందుకు సాగేవాడే సమర్థుడు. అందుకే స్వామి వికేకానందుడు సమర్థవంతులైన కొందరి జీవితమే చరిత్ర అని వ్యాఖ్యానించారు. బీదవాడుగా జన్మించడం తప్పుకాదు. పేదవాడిగా మరణించడమే తప్పు అంటూ ఓ కవి నిర్దేశించారు. దీన్ని సార్థకం చేసుకున్నవారే సమర్థులు. అలాగని ప్రతి ఒక్కరూ ధనవంతులై పోవాలని కాదు. స్వయంకృషితో ఎదగాలని కవి భావం. ప్రతి వ్యక్తీ తన కుటుంబ పోషణకు సరిపడా ధనం ధర్మమార్గంలో సంపాదించాలి. కాని, అవసరాల కోసం పక్కవాడి పొట్ట కొట్టకూడదు. మాయమాటలు చెప్పి సాయం పొందడం అనైతికం. బీదరికం అనేది జీవిత సామర్థ్యం నిరూపించుకోవడానికి అందిన వరంగా భావించాలి. అందుకు తగ్గట్టుగా ధర్మబద్ధమైన మార్గాన్ని నిర్దేశించుకోవాలి. ఈశ్వరీయ జ్ఞాన యోగాల సంపదను సముపార్జించ కుండా శరీరం వదలడం అంటే మీ జీవనయానం సరైన దిశలో సాగలేదనే అర్థం.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ఏది మంచి, ఏది చెడు తెలియజేస్తూ మనుష్యులను ముందుకు నడిపిస్తు న్నాయి. ఆదికాలం నాటి మానవ జీవన విధానం వేదాలలో అక్షర రూపమైందా..? వేదాక్షర రూపాన్ని మానవులు పాత్రగా పోషించి ఇతిహాసం అని అంటున్నారా..? అనేది అసలు ప్రశ్న. అయితే ఈ రెండూ ఒకే చక్రంలో తిరుగుతున్నాయి. ఇందులో ఏది ముందు, ఏది తర్వాత అన్న భేదం లేదు. ఈ రెండూ మనుష్య జాతిని సరైన మార్గంలో నడిపిం చడానికి పరమాత్ముడు సృష్టించిన అద్భుతమైన శక్తులే.

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## నేడు అనకాపల్లికి పురంధేశ్వరి



అనకాపల్లి : పట్టణంలో శనివారం జరిగే భారతీయ జనతాపార్టీ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి దగ్గుపాటి పురందేశ్వరి పాల్గొంటారని జిల్లా పార్టీ అద్యక్షులు పొన్నగంటి అప్పారావు ఒక ప్రకటలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలకు నిరసనగా ఉదయం 10 గంటలకు నెహ్రుచౌక్ జంక్షన్‌లో జరిగే కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని చెప్పారు. బిజేపి, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పదాధికారులు, పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### పోరాటాల ఫలితంగానే
## ప్రజల కల నెరవేరుతుంది

దేవరాపల్లి : పోరాటాల ఫలితంగానే ప్రజల కల నెరవేరుతుందని సిపిఎం నాయకులు పెర్కొన్నారు .మండల కేంద్రం దేవరాపల్లి లో శుక్రవారం జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి .వెంకన్న ,మండల కార్యదర్శి సి హెచ్ .రాజు ,కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ దేవరాపల్లి మేజర్ పంచాయతీలో స్మశాన వాటికలో షెడ్లు నిర్మాణం చేపట్టాలని గత నెల 8 న సిపిఎం అధ్వర్యంలో స్థానిక ప్రజలు ఒక్క రోజు నిరాహార దీక్ష చేశారన్నారు .దీని ఫలితంగానే శారద నది ఒడ్డున ,అంబేద్కర్ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికల్లో షెడ్ల నిర్మాణం కోసం ఉపాధి హమీ నిధులు 11 లక్షల 91 వేయి 862 రూపాయలు మంజురు అవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు .స్మశానంలో సౌకర్యాలు లేక ,20 వేలకు పైబడిన జనాభా ఉన్న ఇంత వరకు పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు .చివరకు ప్రజలే దీక్షలు చేసి సమస్యను పరిష్కరించుకున్నారన్నారు .శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరు కు కృషి చేసినా అధికారులకు ,ప్రజా ప్రతినిధులకు దేవరాపల్లి ప్రజల తరపున సిపిఎం అభినందనలు తెలిపారు .వెంటనే పనులు ప్రారంభించి గ్రామాభివృద్ధికి తొడుప్పు డాలని వెంకన్న ,రాజు,అప్పారావు ఈ సందర్బంగా హితవు పలికారు

### కౌన్సిలర్ సస్పెషన్‌పై న్యాయపోరాటానికి సిద్ధం: వైయస్సార్ సి.పినేత అవనాపు విక్రమ్

విజయనగరం: బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిజం మాట్లాడినందుకు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 36వ వార్డు కౌన్సిలర్ గాడి అప్పారావును సస్పెషన్ చేశారని, ఇది చాలా దారుణమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం నియోజకవర్గ నాయకులు అవనాపు విక్రమ్ ఖండించారు. శుక్రవారంఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత నెల 29వ తేదీన కౌన్సిలర్ గాడు అప్పారావు మంచినీటి సమస్యలపై జరిగిన ధర్నాలో మాట్లాడారని , ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు అధికార కౌన్సిలర్లు చేస్తున్న అన్యాయాలను అడగటం నచ్చక కౌన్సిలర్‌ను సస్పెండ్ చేశారని ఆయన దుయ్యబెట్టారు. అసలు ఏ సెక్షన్ క్రింద వారిని సస్పెండ్ చేశారో కమీషనర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ముందు ఏ విధమైన నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేసినందుకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంటా చింతపల్లి, పిన్నింటి చంద్రమౌళి, ముళ్ల త్రినాధ్ పాల్గొన్నారు.

## గీతం వేదికగా హెచ్‌ఆర్ నిపుణుల సమ్మేళనం



విశాఖపట్నం : దేశంలోని సుప్రసిద్ధ పరిశ్రమలలో కార్పోరేట్ సంస్థలలో మానవ వనరుల విభాగాలను పర్యవేక్షిస్తున్న చీఫ్ హెూమన్ రిసోర్స్ ఆఫీసర్ (హెచ్‌ఆర్‌ఒ)ల ఒకరోజు జాతీయ సమ్మేళనం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నవంబర్ 24న నర్వహించనున్నట్లు గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ కె.శివరామకృష్ణ ఈ జాతీయ సమ్మేళనానికి సంబందించిన విశేషాలతో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరించారు.గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ బిజినెస్ (జిఎస్‌ఐబి) మరియు అంతర్జాతీయ సంస్థ గ్లోబల్ వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ (జిడబ్లుఎఫ్ఎమ్) ఫోరం సంయుక్తంగా ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఈ జాతీయ సమ్మేళనానికి చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్న ఆయన మాట్లాడుతూ మానవవనరుల విభాగాలు సంస్థలకు ఆయపు పట్టువంటిదని ఈ దృష్ట్యా పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పోటీని తట్టుకుని నిలవాలంటే మానవ వనరుల విభాగాలు ఏ విదంగా వ్యవహరించాలి అనే అంశంపై నిపుణులు ఈ సమ్మేళనంలో చంర్చిస్తారని తెలిపారు.

మానవవనరుల పనితీరు నైపుణ్యాభివృద్ధి సవాళ్ళు వంటివి ప్రధాన అంశాలుగా చర్చలు కొనసాగుతాయన్నారు. ఈ జాతీయ సమ్మేళనానికి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ రాజాపప్పు మాట్లాడుతూ 38 మంది చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్లు 200 మంది పరిశ్రమల హెచ్‌ఆర్ నిపుణులు, 1200మంది విద్యార్థులు, హైదరాబాద్,విశాఖ, బెంగుళూరుల నుంచి కళాశాలల ప్లేస్‌మెంట్ అధికారులు ఈ సమ్మేళనానికి హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సమ్మేళనం కో-కన్వీనర్ జి.ఎస్.ఐ.బి. సీనియర్ ప్రొఫెసర్ డి.రవినాధ్, గ్లోబల్ వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ (జిడబ్లుఎఫ్ఎమ్) వ్యవస్థాపకులు ఆర్.శివకుమార్, పాత్రో గంగూలి పాల్గొన్నారు.

## సత్యసాయిబాబా మందిరంలో సీతారాం



అనకాపల్లి : స్థానిక గవరపాలెంలో వేంచేసియున్న శ్రీ సత్య సాయిబాబా ఆలయంలో జరిగిన బాబా వారి 93 వ జయంతి వేడుకల సందర్భంగా శుక్రవారం జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సీతారాంను ఘనంగా సన్మానించారు. తదుపరి ఆయన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాండ్రేగుల సునీల్, మారిశెట్టి శ్రీను, దాడి బుజ్జి, దాడి పరదేశినాయుడు, పాము పైడిరాజు, సురభి హరీష్, గల్లా వినోద్, జ్యోతుల గణేష్, షేక్ ఉమర్ అబ్దుల్ అలి, ఐ. నాయుడు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి



బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న గండి బాబ్జి

సబ్బవరం : మండల కేంద్రంలో గోపాల్‌నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులను మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి శుక్రవారం పరామర్శించారు. గ్యాస్ బండ పేలి మూడు కుటుంబాలు సర్వం కోల్పోయారు.

వారిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు కోరాయి ఎర్రయ్య, రమణ, బోను దేముడులకు మూడు కుటుంబాలకు కలిపి 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. రూ.20వేల వంట సామగ్రి, బియ్యం అందజేస్తామని బాధితలకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వం కోల్పోయిన అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పక్కా గృహాల నిర్మాణం కొరకు ప్రభుత్వం వారితో మాట్లాడుతామన్నారు. సర్వం కోల్పోయిన బాధితులను చూసి గండి బాబ్జి చలించిపోయారు. ఈ కార్యక్రమంలో కర్రి బాబు, పల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా నిర్వహించిన
## పోలమాంబ అనుపోత్సవం



భీమునిపట్నం : భీమిలి ఎగువపేట లో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం గురువారం రాత్రి ఘణంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పోలమాంబ అమ్మవారి ఆలయంనుంచి భారీ ఊరేగింపు తో బయలుదేరి మెయిన్ రోడ్డు మీదుగా వెళ్ళింది. ఈ ఊరేగింపు లో నేలవేషాలు బండ్లవేషాలు, కోయిడాన్సులు, సాము గరిడీలు,తప్పెటగుళ్ళు తదితర వేషాలతో సంభరం నిర్వహించారు. ప్రతీ ఐదేళ్ల కొకసారి ఈ ఉత్సవంను నిర్వహిస్తారు. కాగా ఈ ఏడాది ఘణంగా నిర్వహించాలనీ గ్రామాభివృద్ధి సేవాసంఘం నిర్ణయోంచడంతో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం ఉదయం అనకాపల్లి పార్ధమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలి మత్స్యకార ఆరాధ్యదైవం పోలమాంబ అమ్మవారిని దర్శించుకొని భక్తిశ్రద్దలతో పూజించారు. ఆయనతో పాటు మహేష్, కరుణాకర్ రెడ్డి లను గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షులు గంటానూకరాజు, సన్మానించారు ఇందులో, ఉత్సవ కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసుపల్లి. కొండబాబు, కమిటీ సభ్యులు ఉన్నారు. అమ్మవారిని,అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## పేదలకు ఇళ్ల పట్టాలు అందించిన ఎమ్మెల్యే వాసుపల్లి
### 26వవార్డుల గ్రామదర్శిని



విశాఖపట్నం : నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రకటించారు. విశాఖ దక్షిణం 26వవార్డులో గ్రామదర్శిని కార్యక్రమం చేపట్టారు. పేదల ఇళ్లకే వెళ్ళి ఎమ్మెల్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాల కోసం 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మా కలను సాకారం చేశారని పేద ప్రజలు ఆనంద భాష్యాలతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమరంలో బుచ్చా రామురెడ్డి, పిల్లి వరలక్ష్మి, రమణ, చినరెహమాన్, సూరి అప్పారావు, పైజుర్ రెహ్వాన్, ఆలేటి వెంకటరావు, నాయన రాజారెడ్డి, గుంపిన అప్పలరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపోరాట దీక్షను విజయవంతం చేయండి:దేశం పార్టీ పిలుపు

విజయనగరం : ఈనెల 27వ తేదీన అయోధ్యామైదానంలో జరిగే ధర్మపోరాట దీక్షను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు విజయనగరం శాసనసభ్యురాలు మీసాల గీత పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విజయనగరం నియోజకవర్గ పార్టీ శ్రేణులు సమావేశమై ధర్మపోరాట దీక్ష ఏర్పాట్లుపై చర్చించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ విభజన చట్టం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, ప్రత్యేక హెూదాను ఇవ్వని కేంద్రంపై తలపెట్టిన ధర్మపోరాట దీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. జిల్లా కేంద్రంలో ఈనెల 27న ముఖ్యమంత్రి చేపడుతున్న ధర్మపోరాట దీక్షకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బిజెపికి వ్యతిరేకంగా చంద్రబాబు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. విజయనగరం నియోజకవర్గంలో కార్యకర్తల, ప్రజల సౌకర్యార్థం ప్రతీ వార్డుకు 50 ఆటోలను ఏర్పాటు చేస్తున్నామని అలాగే గ్రామానికి 40 ఆటోలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే మండల పరిధిలో ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్వచ్చందంగా ప్రజలు సభకు వచ్చేవిధంగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తెలుగుదేశం పార్టీ నిర్వహించే సభలకు డబ్బులు ఖర్చుపెట్టి జనాలను తరలించే పరిస్థితి ఉండదన్నారు. ధర్మపోరాట దీక్ష సభకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. అలాగే ఆటోలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తామని తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో దీక్షలు చేపడుతున్నారని, విజయనగరం జిల్లాలో కూడా దీక్షను విజయవంతం చేసి ఢిల్లీకి పోరాటవేడి తాకేలా తెలుగుదేశం పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. లక్షలాదిమంది ప్రజలు ధర్మపోరాట దీక్షకు వస్తారని అంచనాలు వేస్తున్నామన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ ధర్మపోరాట దీక్షను పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేసామని, ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించి సభను భారీస్థాయిలో విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ధర్మపోరాట దీక్ష ద్వారా విజయనగరం సత్తా ఏమిటో తెలియజేసేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ఎం రాజు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బొద్దల నర్సింగరావు, ఎఎంసి చైర్మన్ సైలాడ త్రినాధ్, తెలుగుయువత అధ్యక్షుడు కర్రోతు వెంకట నర్సింగరావు, జడ్పీటీసీ తుంపల్లి రమణ, పురపాలక సంఘం వైస్ చైర్మన్ కనకల మురళీమోహన్, బలివాడ అప్పారావు, తోలాపి మోహనరావు, కెంగువ శ్రీను, ఈగల సత్తిబాబు, రొంగలి రామారావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం: ఎమ్మెల్యే గీత



విజయనగరం : ప్రజల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. శుక్రవారం 2, 4, 6, 9 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అన్ని వర్గాలకు ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం తెలుగుదేశంతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి ఎన్నో సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ పరిపాలనలో అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలను తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్లలోనే 98 శాతం మేనిఫెస్టో హామీలను అమలు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా మున్ముందు జరగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి చారిత్రక అవసరమన్నారు. ప్రజలు స్వచ్చందంగా ప్రజలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ పేద ప్రజలకు ఇచ్చే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడంతో పాటు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వార్డుల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు డా.వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి వుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనకల మురళీమోహన్, కౌన్సిలర్లు కిలాన పార్వతీ, ఎం.పార్వతీ, తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దాల ముత్యాలరావు, ఉపాధ్యక్షుడు తోలాపి మోహనరావు, కిలాన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈఏడాది 2.50 కోట్ల మొక్కలు నాటాలి
### రాష్ట్రమంత్రి సజయకృష్ణ



విజయనగరం : చెట్ల ప్రాధాన్యత గుర్తించి చెట్ల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గనులు,భూగర్భ శాఖా మాత్యులు ఆర్.వి.సుజయ్ కృష్ణ రంగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఫూల్‌బాగ్‌లోని ఫారెస్ట్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన కార్తీక వన మహెూత్సవంలో ఆయన పాల్గొన్నారు. గత ఏడాది 1.75 కోట్ల మొక్కలు నాటించడం గొప్ప విషయమని, వాటిని సంరక్షించే బాధ్యత వహించాలని కోరారు. నాటిన మొక్కలపై సామాజిక తనిఖీ చేపట్టి బతికిన మొక్కల వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఈ ఏడాది 2.50 కోట్ల మొక్కలు నాటడంలక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. 2029 నాటికి 50 శాతం చెట్లు భూమిపై ఉండాలన్నారు. వనసంరక్షణ కార్యక్రకమాల పట్ల ఒక శాతం చెట్లు పెరిగాయని తెలిపిన దేశంలోనే అత్యధికంగా అటవీ ప్రాంతం పెరిగిన రాష్ట్రంగా గుర్తింపుపొందామన్నారు. హెలికాప్టర్ ద్వారా విత్తనాలు జల్లి రిజర్వు ఫారెస్టు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓజోన్‌పార దెబ్బతిని ఉష్ణం పెరిగే పరిస్థితి నుంచి ఓజోన్ లేయర్ పెరిగి ఉష్ణోగ్రత తగ్గించే స్థితికి రావాలన్నారు. ప్రభుత్వ భవనాలు నిర్మించేటప్పుడు ముదుగా ల్యాండ్ స్కేపింగ్ చేసి మొక్కలు నాటిన తర్వాత పనులు ప్రారంభించటం భవన నిర్మాణంతో పచ్చదనం అభివృద్ధి చేయడం అవసరమన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎం.హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయని మొక్కలు నాటి సంరక్షించాల్సి బాధ్యత గుర్తించాలన్నారు. రానున్న రెండేళ్ళలో జిల్లా ఉష్ణోగ్రత కనీసం రెండు డిగ్రీలు తగ్గించాలన్న ధ్యేయంతో పనిచేయాలన్నారు. విద్యార్థులను, పోలీసులను భాగస్వాములు చేసి మొక్కలు నాటటంతో పాటు పిచ్చిమొక్కలు తొలగించటం చేసి పర్యావరణ పర్యాటకంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వన ప్రతిజ్ఞ చేయించారు. వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు మంత్రి బహుమతులు అందించారు. తదుపరి సాంస్కృతిక కార్య క్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులు, ద్వారపురెడ్డి జగదీశ్, ఎమ్మెల్యేపతివాడ నారాయణస్వామి, బొబ్బిలి చిరంజీవులు. జెడ్పీ వైస్-చైర్మన్ బి.కృష్ణ మూర్తి, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, డివిజనల్ అటవీ శాశాధికారులు జి.లక్ష్మణ్, బి.జానకీరావు, ఆర్డీఓ జి.వి.మురళి, సిటీకేబుల్ ఎం.డి.శ్రీనివాసరావు, మాజీ శాసన సభ్యులు గద్దె బాబురావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

WANTED
• PERSONAL ASSISTANT
• CASHIER
• PHOTO GRAPHER CUM DESIGNER
• OFFICE ASSISTANT
• MARKETING EXECUTIVES
93942 93547

# ఘనంగా పంపా హారతులు, జ్వాలా తోరణం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి కార్తీక పౌర్ణమి గిరి ప్రదక్షిణ అనంతరం సాయంత్రం 6 గం.లకు కొండ దిగువన పంపా సరోవరం చెంత శ్రీ స్వామి,అమ్మవార్లకు పూజలు చేసిద అనంతరం దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్ర,చైర్మెన్ ఐవి.రోహిత్, పిఆర్వో తులా.రాముడు, దేవస్థానం పాలకమండలి సభ్యులు సహయంతో పంపాకు హరతులు ఇచ్చారు.అనంతరం కొండ దిగువన తొలిపావాంచ వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం అత్యంత ఉత్సాహ భరితముగా చేసారు

# ప్రతిభకు పదునుపెడుతున్న ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యార్థులు



అచ్యుతాపురం : సాంకేతిక విద్యను అభ్యసిస్తే జీవితంలో రాణించడమే కాకుండా లక్ష్యాన్ని సాధించవచ్చునని అది పాలిటెక్నిక్ వల్లే సాధ్యమౌతుందని ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యార్థులు నిరూపిస్తున్నారు. స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభకు పదునుపెడుతు రైతులకు ఉప యోగపడేవిధంగా పాడైపోయిన ఆటో ఇంజన్ తో తక్కువ వ్యయంతో నాలుగు చక్రాల వాహనాన్ని తయారుచేసారు. శుక్రవారం తాము తయారుచేసిన వాహనాన్ని కళాశాల ఆవరణలో నడిపించారు. ఈ వాహనానికి నాగళ్లు అమర్చి దుక్కు దున్నడం , తొట్టును అమర్చి ఎరువులను సరఫరా, పండించిన పంటను మార్కెట్ కు చేరవేయ వచ్చునని విద్యార్థులు తెలిపారు .ఈ సందర్భంగా ప్రతిభ చూపుతున్న విద్యార్థులు పృధ్వి, సాయినాధ్, రాజశేఖర్ , మురళి, ప్రవీణ్ లను కళాశాల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, ప్రిన్సిపల్ కె శ్రీనివాసరావు అభినందించారు .

# ఏవిఎన్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



విశాఖపట్నం: స్థానిక మిసెస్ ఏవిఎన్ కళాశాలలో ప్రముఖ ఎంఎన్సి అయిన కాన్సెన్ట్రిక్స్ కంపెనీ న్యూఢిల్లీ వారు శుక్రవారం ప్రాంగణ ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపిక విధానంలో ఆంగ్ల భాషపై పట్టును, వ్రాత పరీక్ష, మౌకిక పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు 60 మంది విద్యార్థులు హాజరవ్వగా ఎనిమిది మంది విద్యార్థులు 2.3 లక్షల వార్షిక ఆదాయంకు ఎంపిక అయ్యారని కళాశాల ప్లేస్మెంట్ అధికారి కెప్టెన్ డా॥ ఎన్. రామకృష్ణ తెలియజేశారు. ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి. విజయ్ప్రకాష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాన్సెన్ట్రిక్స్ కంపెనీ నుండి ఎం. బాలసుబ్రమణ్యం, ప్లేస్మెంట్ ఆఫీసర్ కెప్టెన్ ఎన్. రామకృష్ణ, ట్రైనర్ డి. కృష్ణకుమారి, ఐక్యూఎసి కన్వీనర్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జీవ వైవిధ్యంతోనే సామాజిక మనుగడ సాధ్యం ఎంపిడిఓ వసంత మాధవి

పెద్దాపురం: జీవ వైవిద్యంతోనే సామాజిక మనుగడ సాధ్యమని ఎంపిడిఓ వసంతమాధవి అన్నారు. మండల పరిధిలోగల జి. రాగంపేటలో జీవ వైవిద్య కమిటీతో కలిసి ఆమె షాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ షెడ్ని పరిశీలించారు. సహజ సిద్ధంగా లభించే వనరులతో ఎరువులు తయారు చేసుకొనేందుకు షాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ విధానంతో సాధ్యపడుతుందని దానికొరకు ప్రత్యేక జీవకమిటీని నియమించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుడాల రమేష్ జడ్పిటిసి శివనాగరాజు, కోప్షన్ సభ్యుడు బొడ్డు వెంకన్న, టిడిపి మండల అధ్యక్షులు కోటి పాల్గొన్నారు.

## జ్ఞాన ధారతో ఉత్తమఫలితాలు

పెద్దాపురం: విద్యార్థులుఉత్తమ ఫలితాలు సాధించడానికి జ్ఞాన ధార తరగతులు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాశాఖాధికారి దుర్గా ప్రసాద్ అన్నారు. మండలంలోగల చంద్రమాంపల్లి హైస్కూల్లో నిర్వహించిన సమ్మెటిన్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల వారు ఉత్తమ ఫలితాలు సాధించడానికి జ్ఞానధారతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాయత్రి,నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

## భస్కీలో చేతిపంపు రిపైర్ చేయ్యించాలి

అరకు: అరకులోయ మండలంలో గల మారుమూల గల భస్కీ గ్రామపంచాయతీ చేతిపంపు మరమ్మతుకి గురి అవ్వడంతో మంచినీటి కొరకు తీవ్రఇబ్బంది పడుతు మ దాహం కేకలు ఎవరు తీరూస్తరో అని మహిళలు,గ్రామస్తులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు అని గిరిజన సంఘం మండల కార్యదర్శి రామరావు తెలిపారు.ఇన్ని సమస్యలు ఉన్న పంచాయతీ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ ఖాతార్ చెయ్యలేదని అన్నారు. నేటికైన పంచాయతీ ప్రత్యేక అధికారులు వచి గ్రామంలో ఉన్న సమస్యలు స్పందించి పరిష్కారం చేస్తారని గ్రామస్తులు కోరుతున్నారు.

## అంగన్వాడీ టీచర్లకు అదనపు పనులు అప్పగించవద్దు



అచ్యుతాపురం : అంగన్వాడీ టీచర్లకు బి ఎల్ ఓ డ్యూటీలు ,అదనపు పనులు అప్పగించవద్దని సి ఐ టి యు జిల్లా కార్యదర్శి రొంగలి రాము తో కలిసి అంగన్వాడీ టీచర్లు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు .

## ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



రావులపాలెం: ప్రత్యక్షదైవం ప్రేమావతార స్వరూప భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి జన్మదిన వేడుకలు రావులపాలెంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సత్యసాయి అష్టదళ సేవా పుష్పం (సేవాకేంద్రం)లో మహావతార్ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 93 వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ మన్యం పర్వత వర్ధనరావు ఆధ్వర్యంలో ఓంకారము, సుప్రభాతము, ప్రశాంతి పతాకావిష్కరణ ఏకాదశ రుద్రాభిషేకము, సాయంత్రం స్వామి వారి పాదుకలు, స్వామి వస్త్రములతో, 93 దివ్య జ్యోతులతో గ్రామ పురవీధులలో బాబా నామస్మరణతో సంకీర్తనలు ఆలపిస్తూ నగర సంకీర్తన నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్కి ఊంజలసేవ, మహా మంగళ హారతి అశేష భక్తుల నడుమ వైభవంగా నిర్వహించిన అనంతరం భక్తులు స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్విఎస్ రెడ్డి, చిన్నం తారకరామారెడ్డి, నడింపల్లి రామకృష్ణంరాజు, చిర్ల వెంకటరెడ్డి, ఒంటెద్దు బంగారయ్య, మేడపాటి భాస్కరరెడ్డి, చెక్కా సూర్యప్రకాష్, కోనాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ పొయ్యిలు లేని గ్రామలు ఎన్నో..ఏ నాయకుడు కష్టం తీరుస్తాడు..



అరకు: విశాఖ గిరిజన ప్రాంతంలో జీవిస్తున్న ఆధివాసి గిరిజనులు ఎన్నో మందికి కట్టెల పొయ్యే గతైంది అని ఆయా గ్రామాల గిరిజన మహిళలు కట్టెలు మోసుకుంటూ ఆవేదన పడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇంటింట ప్రతి పేదోడు గ్యాస్ పొయ్యి మీదే వంట చెయ్యాలని చెప్పి నేటికి కొద్ది మందికి మత్రమే ఇచి కొన్నివేల మందికి ఇవ్వక పోవడంతో ఎన్నో ఆవేదన చెందుతున్నమని ఆయా గ్రామాల గిరిజనులు అంటున్నారు.

## ఘనంగా నాగ చైతన్య జన్మదిన వేడుకులు



విశాఖపట్నం: ఏపీ స్టేట్ వైడ్ అక్కినేని నాగార్జున నాగచైతన్య అఖిల్ ఫ్యాన్స్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి. రాముయాదవ్ ఆధ్వర్యంలో అక్కినేని నాగ చైతన్య జన్మదిన వేడుకులు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ ముఖ్య అతిధిగా హాజరై కేక్ కటింగ్ చేసి అనంతరం వృదులకి రొట్టెలు పళ్ళు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీనివాస్ నవీన్ ప్రసాద్ , బి.శంకరరావు వాసు గోవింద్ డి.శంకరరావు రవికుమార్ సిద్దు శివమణి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల కేంద్రంగా విశాఖ

### అన్ని పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే - మంత్రి గంటా



విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఒకినావా మార్షల్ష్ అర్ట్ అకాడమి సిల్వర్ జూబ్లి ఉత్సవాలు సందర్భంగా స్వర్ణభారతి స్టేడియంలో నిర్వహిస్తున్న కరాటే పోటీలకు శుక్రవారం మాంత్రి గంటా ముఖ్య అతిధిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతీ పాఠశాల లోనూ క్రీడలకు విధిగా ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనన్నారు. అందుకు తగ్గ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. విశాఖ క్రీడలకు కేంద్రంగా మారబోతుందన్నారు. అగనంపూడి వద్ద 150 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సను నిర్మిస్తున్నామన్నారు. విశాఖ వేదికగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 19 రాష్ట్రాలనుండి క్రీడాకారులు హాజరుకావడం పట్ల మంత్రి గంటా నిర్వాహకులను ప్రశంసించారు. గౌరవ అతిధిగా హాజరైన వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో క్రీడలను విశాఖ వేదికగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం అభినంద నీయమాన్నరు. ఈ సందర్భంగా మంత్రి గంటా పోటీలను ప్రారంభించారు. అనంతరం మంత్రి గంటాను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఆలిండియా అధ్యక్షులు శ్రీనివాసన్, పోటీలు చీఫ్ ఆర్గనైజర్ గంటా కనకారావులు పోటీల వివరాలను మంత్రి తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వివిధ రాష్ట్రాల క్రీడాకారులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.



జగ్గంపేట ఇరిపాక గ్రామంలో ఒక కోటి 8 లక్షల శివలింగాలకు మహాకుంబాభిషేకం శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామివారి దేవాలయంలో నిర్వహించబడింది. శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కుమారుడు జిల్లాపరిషత్ చైర్మన్ జ్యోతుల నవీన్ దంపతులు మరియు కుటుంబ సభ్యులు, భక్తులతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ మహాకుంబాభిషేకంలో రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, చిక్కాల రామచంద్రరావు, నల్లమిల్లి వీర్రెడ్డి, సుంకరపావనీ దంపతులు, పిల్లి అనంతలక్ష్మీ దంపతులు, వనమాడి వెంకటేశ్వరరావు, వరుపుల సుబ్బారావు, గొల్లపల్లి సూర్యారావు, పి. నారాయణమూర్తి, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎ.పి.ఆర్.సెట్-2018లో రిజర్వేషన్ కేటగిరికి జరిగిన అన్యాయంపై

### వినతిపత్రం సమర్పించిన ఏ.పి. బహుజన విద్యార్థి సమాఖ్య



విశాఖపట్నం: ఇటీవల ఆగష్టులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2018 (ఎ.పి.ఆర్.సెట్-2018) పరిశోధన ప్రవేశ పరీక్ష ఫలితాలకు సంబంధించి రిజర్వేషన్ కేటగిరికి చెందిన యస్సీ, యస్టీ, బి.సి. వర్గాలకు అన్యాయం జరిగిందని ఏ.పి. బహుజన విద్యార్థి సమాఖ్య విచారం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆర్.సెట్-2018 కన్వీనర్ అయినటువంటి ప్రొ॥కె.శ్రీనివాసరావుని కలిసి బహుజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎ.పి.ఆర్.సెట్ ప్రవేశపరీక్షా ఫలితాలకు సంబంధించి రిజర్వేషన్ కేటగిరికి చెందిన యస్.సి., యస్టీ, బి.సి. వర్గాల అభ్యర్థులకు 45% కటాఫ్ను ప్రామాణికం చేయడం వలన మెజారిటీ అభ్యర్థులు ప్రవేశపరీక్షలో అర్హత సాధించలేకపోయారని దీని ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా వున్న అన్ని యూనివర్శిటీల్లో కలిపి, 2500 పిహెచ్.డి సీట్లకు గాను 1100 సీట్లకు మాత్రమే అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. మిగిలిపోయిన 1400 సీట్లకు కూడా 45% నుండి 35%కు కటాఫ్ తగ్గించి మరో దఫా ఫలితాలను విడుదల చేసి మిగిలిన సీట్లను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎ.పి.ఆర్.సెట్ కన్వీనర్ ప్రొఫెసర్.కె.శ్రీనివాసరావు స్పందించి, 35% కటాఫ్కు సంబంధించి గతంలోనే తాను ఉన్నత విద్యాశాఖాధికారులతో చర్చించినట్లు తెలిపారు. అయినప్పటికి మరోమారు ఉన్నత విద్యాశాఖాధికారులతో చర్చించి, అభ్యర్థులకు న్యాయం చేకూరేలా కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి విజయభాస్కర్, ఆంధ్రాయూనివర్శిటీ వై.యస్.ఆర్.సి.పి.విద్యార్థి విభాగం నాయకులు బి.యస్.కుమారస్వామి, గిరిజన విద్యార్థి విభాగం నాయకులు పి.రాజ్కుమార్, యండమూరి రాజశేఖర్, బి.మోహన్ మొదలైన వారు పాల్గొన్నారు.

# చిత్రభాను



# రంగు

రివ్యూ

కథ ఎక్కడి నుంచి తీసుకొంటున్నామని కాదు. దాన్ని ఎంత ఆసక్తికరంగా చెప్పారనే విషయంపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. నిజ జీవిత కథలతో సినిమా తీస్తున్నప్పుడైతే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముందే తెలిసిన ఆ కథకి మరింత డ్రామా జోడించి ఇంకేదో కొత్తదనం చూపించాలి. విజయవాడకి చెందిన లారా అనే వ్యక్తి జీవితం ఆధారంగా తెరకెక్కించిన చిత్రంగా 'రంగు'కి మంచి ప్రచారమే లభించింది. దానికితోడు బిగ్‌బాస్ 2తో ప్రేక్షకులకు చేరువైన తనీష్ కథానాయకుడు కావడంతో సినిమాపై మరింత ఆసక్తి ఏర్పడింది. మరి అందుకు 'రంగు' ఎలా ఉంది? ఏ మేరకు ఆకట్టుకుంటుంది?

కథేంటంటే: విజయవాడలో ఓ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన యువకుడు పవన్‌కుమార్ అలియాస్ లారా (తనీష్). ఇంటర్‌లో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన తెలివైన యువకుడు. డిగ్రీ కాలేజీలోకి చేరాక అతని జీవితం మారిపోతుంది. సీనియర్ల ర్యాగింగ్‌పై తిరగబడి జూనియర్లకి నాయకత్వం వహిస్తాడు. ఇంతలో ఊహించని రీతిలో ఓ వ్యక్తిని హత్య చేసి జైలుపాలవుతాడు. అక్కడ ఏర్పడిన పరిచయాలు సెటిల్‌మెంట్లకి పాల్పడేలా చేస్తాయి. పోలీసులు అతన్ని మార్చే ప్రయత్నం చేయకపోగా లంచం తీసుకొని రౌడీషీట్ ఓపెన్ చేస్తారు. ఏసీపీ రాజేంద్ర (పరుచూరి రవి) నగరానికి వచ్చాక రౌడీలపై ఉక్కుపాదం మోపుతాడు. లారా మాత్రం రాజేంద్రని కూడా లెక్క చేయడు. లారా కనిపిస్తే కాల్చేయాలనే ఆదేశాలున్నప్పటికీ రాజేంద్ర ఏం చేశాడు? లారా మారిపోయినప్పటికీ అతని జీవితంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకొన్నాయి? ఒక పక్క శత్రువులు, మరోపక్క పోలీసుల నుంచి తప్పించుకునేందుకు లారా ఏం చేశాడు? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే: కారణాలు ఏవైనా కత్తి పట్టినవాడు దానికే బలికాక తప్పదని చెబుతుంటారు పెద్దలు. అలాంటి విషయాన్ని చెప్పే కథే ఇది. నిజ జీవిత వ్యక్తులు, సంఘటనలతో సినిమా తీస్తున్నప్పుడు డ్రామా చాలా ముఖ్యం. ఏం జరిగిందో మక్కీకి మక్కీ చూపిస్తాం అంటే అదొక డాక్యుమెంటరీ అవుతుంది తప్ప సినిమా కాదు. ఇంటర్ స్టేట్ ర్యాంక్ సాధించిన ఓ తెలివైన యువకుడు ఎలా రౌడీయిజం వైపు మళ్లాడు? ప్రేమలో పడ్డాక ఎలాంటి మార్పు కోరుకున్నాడు? మారాక ఎలాంటి పరిస్థితులు చోటు చేసుకొన్నాయి? అనే విషయాలు ఆసక్తికరమే. కానీ, కథలో ఉన్న ఆ ఆసక్తి తెరపైకి తీసుకురావడంలో విఫలమయ్యారు దర్శకుడు. ఏసీపీ రాజేంద్ర పాత్ర పరిచయమయ్యాక ఆయన రౌడీలకి కౌన్సిలింగ్ ఇచ్చే విధానం, వాళ్ల మార్పు కోసం చేసే ప్రయత్నాలు కాస్త ఆసక్తిని రేకెత్తిస్తాయి మినహా సినిమాలో చెప్పుకోదగ్గ విషయం అంటూ ఏమీ లేదు.

మార్పు కోరుకొని ఉద్యోగం చేసుకొంటున్న లారాకి ఎదురయ్యే అనుభవాలు, అతను మళ్లీ సెటిల్‌మెంట్లకి దిగడానికి గల కారణాలు, గర్భవతిగా ఉన్న భార్యని చూడ్డానికి కూడా సాధ్యం కాని పరిస్థితులు సినిమాకి కీలకం. కానీ ఆ సందర్భాల్ని కూడా సాదాసీదాగా చూపించడంతో పాత్రలన్నీ కీ ఇచ్చిన మరబొమ్మల్లా కనిపిస్తాయి. భావోద్వేగాలకి ఆస్కారమున్నా ఆ దిశగా అసలేమాత్రం ద ృష్టిపెట్టలేకపోయారు దర్శకుడు. అలాగే ఏసీపీ పాత్రలో హీరో ఛాయలు కనిపిస్తాయి తప్ప లారా పాత్ర మాత్రం మామూలుగానే అనిపిస్తుంది.




ఎవరెలా చేశారంటే: తనీష్ తన పాత్ర పరిధి మేరకు నటించారు. అక్కడక్కడా బొద్దుగా కనిపిస్తాడు. ఏసీపీ రాజేంద్ర పాత్రలో పరుచూరి రవి చక్కటి అభినయం ప్రదర్శించాడు. పేరు మోసిన రౌడీ మణికంఠగా షఫి, ఎమ్మెల్యేగా డీఎస్ రావు, సైరన్‌గా టార్జాన్ ఆకట్టుకుంటారు.

కథానాయిక ప్రియాసింగ్‌కి చెప్పుకోదగ్గ ప్రాధాన్యం లేకపోయినా ఫర్వాలేదనిపిస్తుంది. పోసాని క ృష్ణమురళి, కారుమంచి రఘు తదతర నటులున్నా హాస్యం మాత్రం పండలేదు. సాంకేతికంగా సినిమా పర్వాలేదనిపిస్తుంది. యోగీశ్వర శర్మ సమకూర్చిన నేపథ్య సంగీతం బాగుంది. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన 'ఎక్కడ ఉంది ఈ చిక్కుముడి' పాట, అది వచ్చే సందర్భం ఆకట్టుకుంటుంది. పరుచూరి బ్రదర్స్ వంటి అనుభవజ్ఞుల చేయి పడినప్పటికీ కథపై మాత్రం వారి కలం ప్రభావం పెద్దగా కనిపించలేదు. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్టే ఉన్నాయి. చిత్ర బ ృందాన్ని తన ఆలోచనలకి తగ్గట్టుగా నడిపిపించాడు కానీ... కథ, కథనాల విషయంలో దర్శకుడి అనుభవం ఏమాత్రం చాలలేదు.

# నాని, నిఖిల్ కలయికలో..





తెలుగులో మల్టీస్టారర్ సినిమాల జోరు కొనసాగుతున్నది. స్టార్‌డమ్, ఇమేజ్‌లతో సంబంధం లేకుండా కథ బాగుంటే స్టార్ హీరోలు సైతం మల్టీస్టారర్ సినిమాల్లో నటించడానికి ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. నాగార్జునతో కలిసి నటించిన మల్టీస్టారర్ చిత్రం దేవదాస్‌తో చక్కటి విజయాన్ని దక్కించుకున్నారు నాని. తాజాగా ఆయన మరో మల్టీస్టారర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సమ్మోహనం సినిమాతో విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నారు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. తన తదుపరి చిత్రాన్ని మల్టీస్టారర్ కథాంశంతో తెరకెక్కించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఇటీవలే ఈ చిత్ర స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ఈ సినిమాలో నాని, నిఖిల్ హీరోలుగా నటించబోతున్నట్లు సమాచారం.

కథలోని వైవిధ్యత నచ్చడంతో వీరిద్దరు ఈ సినిమాలో నటించడానికి సంసిద్ధత వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఇద్దరి పాత్రలకు సమప్రాధాన్యత ఉండే వినూత్న కథా చిత్రమిదని చెబుతున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం సెట్స్‌పైకి రానున్నట్లు సమాచారం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు.

# 24 కిస్సెస్



ముద్దు సన్నివేశాలకి సంబంధించి ఇదివరకు కొన్ని హద్దులు ఉండేవి. 'అర్జున్‌రెడ్డి', 'ఆర్.ఎక్స్.100' చిత్రాలతో ఆ హద్దులు చెరిగిపోయాయి. అయితే వాటిలో కేవలం ముద్దులే కాదు.. అందుకు తగ్గ కథ కూడా ఉంది కాబట్టే అంతగా విజయవంతమయ్యాయి. ఆ సినిమాల తర్వాత ప్రచార పరంగా మాత్రం దర్శక నిర్మాతలకి కొత్త దారులు తెరచుకున్నట్లైంది. ముద్దుల్నే ఎరగా వేసి ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అలా పేరులోనే ముద్దులున్న '24 కిస్సెస్' ప్రచార చిత్రాలతో యువతరం ప్రేక్షకుల్ని బాగా ఆకర్షించింది. 'మిణుగురులు'తో తన ప్రతిభని నిరూపించుకున్న అయోధ్యకుమార్ ఈ చిత్రానికి దర్శకుడు కావడంతో కథపై కూడా అంచనాలున్నాయి. మరి సినిమా ఎలా ఉందో తెలుసుకుందాం...

కథేంటంటే: ఆనంద్ (అరుణ్ అదిత్) చిన్న పిల్లల చిత్రాలు తీసే దర్శకుడు. పెళ్లంటే నమ్మకం లేని వ్యక్తి. ఎంతో మంది అమ్మాయిలతో సంబంధం ఉంటుంది కానీ... ప్రేమలో మాత్రం పడడు. ఇద్దరి మధ్య బంధానికి ఏదో ఒక పేరు ఉండాల్సిందేనా? అంటుంటాడు. అనుకోకుండా మాస్ కమ్యూనికేషన్ చదువుతున్న శ్రీలక్ష్మి (హెబ్బా పటేల్)తో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. శ్రీలక్ష్మి అది ప్రేమే అంటుంది. ఆనంద్ మాత్రం ప్రేమ కాదంటాడు. దాంతో ఇద్దరి మధ్య దూరం పెరుగుతుంది. ఆ తర్వాత ఆనంద్ మళ్లీ శ్రీలక్ష్మిని కలిశాడా? లేదా? అతని మనసులో ప్రేమ ఎప్పుడు పుట్టింది? ప్రేమ పుట్టినా పెళ్లంటే నమ్మకం లేని అతని జీవితంలో ఎలాంటి గందరగోళం చోటు చేసుకుంది? అసలు పెళ్లంటే అతనికి నమ్మకం లేకపోవడానికి కారణమేంటి? తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే.

ఎలా ఉందంటే: నేటితరం మధ్య అల్లుకునే బంధాల నేపథ్యంలో సాగే కథ ఇది. దాన్ని దర్శకుడు 24 ముద్దులతో ముడిపెట్టాడు. స్వతహాగా చిన్న పిల్లల నేపథ్యంలో సాగే ఓ సినిమా తీసిన ఆయన తన ఆలోచనల్ని, స్వీయానుభావాల్ని రంగరించాడు. కథలో ఎన్ని విషయాలు చెప్పినా సినిమాలో ఏదీ అతక్కపోగా... ఆద్యంతం గందరగోళంగా సాగుతుంది. దర్శకుడు అసలు ఈ సినిమాతో ఏం చెప్పదలచుకున్నాడనే విషయం ఒక పట్టాన ప్రేక్షకుడికి అర్థం కాదు. ఒక సినిమా చూస్తున్నప్పుడు అందులో హాస్యమో, భావోద్వేగాలో.. లేదంటే ఆసక్తో ఇలా ఏదో ఒక అనుభూతి కలగాలి. కానీ ఈ సినిమా చూస్తున్నంతసేపు.. ఎంతసేపు ఈ సాగదీత అనే అభిప్రాయం కలుగుతుంది తప్ప ఏ దశలోనూ ఆకట్టుకోదు. ఆనంద్ తన బాధని సైకో థెరపిస్ట్ అయిన మూర్తితో చెప్పుకోవడంతో ఈ కథ మొదలవుతుంది. ఇద్దరి మధ్య బంధానికి ప్రేమ, పెళ్లి అనే పేరు పెట్టాల్సిన అవసరమే లేదనే ఆలోచనలున్న కథానాయకుడు... ప్రేమపైనా, పెళ్లిపైనా నమ్మకమున్న కథానాయిక మధ్య సంఘర్షణే ఈ చిత్రం. ఇద్దరూ శారీరకంగా ఒక్కటయ్యాక భిన్న అభిప్రాయాలున్న వాళ్లు ఎంత దూరం ప్రయాణం చేశారనేది కథాంశం. దానికి దర్శకుడు తనదైన కవితాత్మకతని జోడించే ప్రయత్నం చేశాడు. అయితే ఆ కథనం ఒక పట్టాన అర్థం కాదు. చివరికి ప్రేమని రుచి చూశానన్న కథానాయకుడు మళ్లీ పెళ్లి దగ్గరికొచ్చేసరికి నమ్మకం లేదంటాడు. దాంతో అక్కడ పెళ్లెందుకు ఇష్టం లేదని మరో కథ ఉంటుంది. ఆ ప్రహసనం అంతా సాగదీతగా అనిపిస్తుంది తప్ప వినోదం కానీ, భావోద్వేగాలు కానీ పంచదు. పేరులోనే ముద్దుల్ని చొప్పించిన దర్శకుడు ప్రేక్షకుల్ని ఆకర్షించొచ్చు కానీ... థియేటర్‌లో మాత్రం మెప్పించలేడు. కథ, కథనాల్లో లోపాల వల్ల తెరపై ముద్దులు కూడా తేలిపోయాయి.



ఎవరెలా చేశారంటే: అదిత్ అరుణ్, హెబ్బా పటేల్‌ల నటన బాగుంది. పాత్రలకి తగ్గట్టుగా పరిణతితో నటించారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ కుదిరింది. సినిమా ప్రధానంగా నాలుగు పాత్రల చుట్టూనే తిరుగుతుంది. రావు రమేశ్ సైకో థెరపిస్ట్‌గా కథని నడిపించే పాత్రలో కనిపిస్తారు. అదితి మ్యాకల్ నవతరం అమ్మాయిగా కనిపిస్తుంది. నరేశ్ కథానాయిక తండ్రిగా నటనకి పెద్దగా ప్రాధాన్యం లేని పాత్రలో కనిపిస్తారు. సాంకేతికంగా సినిమా ఫర్వాలేదనిపిస్తుంది. జోయ్ బారువా సమకూర్చిన పాటల్లో రెండు మాత్రమే బాగున్నాయి. ఉదయ్ గుర్రాల కెమెరా పనితనం ఆకట్టుకుంటుంది. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్టుగానే ఉన్నాయి. దర్శకుడు అయోధ్యకుమార్ కథకుడిగా, దర్శకుడిగా విఫలమయ్యారు. తన మేధో సంపత్తినంతా ఉపయోగించి సినిమాని గందరగోళంగా మార్చేశారు. కొన్ని చోట్ల మాటలు ఆకట్టుకుంటాయంతే.

# గాడ్ వర్సెస్ కార్తీక్



నా గత చిత్రం మళ్లీరావాలో నా పాత్ర పేరు కార్తీక్. ఈ చిత్రంలోనూ నా పాత్ర పేరు కార్తికే. ఆ సెంటిమెంట్ ప్రకారం ఈ సినిమా కూడా బాగా ఆడుతుందని నమ్ముతున్నాను అన్నారు సుమంత్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం సుబ్రహ్మణ్యపురం. సంతోష్ జాగర్లపూడి దర్శకుడు. ఈషా రెబ్బ కథానాయిక. సుధాకర్ ఇంపెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై బీరం సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను బుధవారం రాత్రి హైదరాబాద్‌లో హీరోలు సుమంత్, అఖిల్ అక్కినేని సంయుక్తంగా విడుదల చేశారు. అనంతరం సుమంత్ మాట్లాడుతూ సూపర్ నేచురల్ థ్రిల్లర్ కథలు నాకు పెద్దగా నచ్చవు. సంతోష్ కథ చెప్పగానే రెండున్నరగంటలు చాలా ఎట్కగ్జైటింగ్‌గా ఫీలయ్యాను. చెప్పిన దాంట్లో 80 శాతం తీసినా హిట్ అవుతుందని చెప్పాను. అంచనాలకు తగినట్లుగానే చిత్రాన్ని తెరకెక్కించాడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం. ప్రీరిలీజ్ వేడుకను నిర్వహిస్తాం అన్నారు. అఖిల్ అక్కినేని మాట్లాడుతూ ఇలాంటి కథ దొరకడం అంత సులభం కాదు. ట్రైలర్ చూడగానే ఏదో భయపెట్టాలని కాకుండా ఆసక్తికరంగా సినిమాను తెరకెక్కించారని అనిపించింది. సుమంత్ అన్నంటే నాకు చాలా ఇష్టం అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ కార్తికేయ చిత్రానికి సీక్వెల్‌లా అనిపించొచ్చు కానీ ఇది ఆ సినిమాకు సీక్వెల్ మాత్రం కాదు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనే పాయింట్ తప్ప కార్తికేయ చిత్రానికి మా సినిమాకు ఎలాంటి సంబంధం వుండదు. ఇదో డివోషనల్ థ్రిల్లర్. అనుగ్రహించే దేవుడే ఆగ్రహిస్తే పరిస్థితేంటి? అనేదే ఈ చిత్ర ప్రధాన ఇతివ ృత్తం. కార్తీక్ వర్సెస్ గాడ్ నేపథ్యంలో సినిమా ఆద్యంతం కొత్తగా వుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం శివకుమార్, సుధాకర్‌రెడ్డి, ఈషా రెబ్బ తదితరులు పాల్గొన్నారు.

# సరికొత్త మజిలీ

తెలుగు చిత్రసీమలో విజయవంతమైన జోడీగా గుర్తింపును సొంతం చేసుకున్నారు రియల్‌లైఫ్ కపుల్ నాగచైతన్య, సమంత. పెళ్లి తర్వాత వీరిద్దరు కలిసి ఓ సినిమాలో నటిస్తున్నారు. నిన్ను కోరి ఫేమ్ శివ నిర్వాణ దర్శకుడు. షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. నేడు నాగచైతన్య జన్మదినం. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న రొమాంటిక్ డ్రామా ఇది. పెళ్లి తర్వాత ఓ జంట జీవనగమనంలో చోటుచేసుకున్న సంఘటనల సమాహారమే ఈ చిత్ర కథ. నాగచైతన్య, సమంత కలయికలో వస్తున్న నాలుగో సినిమా ఇది. కొద్ది రోజులుగా వైజాగ్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. ఈ షెడ్యూల్ పూర్తయింది. తదుపరి షెడ్యూల్‌ను ఈ నెల 26 నుంచి హైదరాబాద్‌లో తెరకెక్కిస్తాం. నలభై శాతం చిత్రీకరణ పూర్తయింది.

దివ్యాంశ కౌశిక్ మరో కథానాయికగా నటిస్తున్నది అని తెలిపారు. ఈ చిత్రానికి మజిలీ అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తనికెళ్ల భరణి, రావురమేష్, పోసాని క ృష్ణమురళి, సుబ్బరాజు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విష్ణుశర్మ, సంగీతం: గోపీసుందర్, కళా దర్శకత్వం: సాహిసురేష్.



# వైభవోపేతముగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న సత్యదేవుని గిరి ప్రదక్షిణ దేవస్థానం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత వైభవంగా జరిగింది.ఈ గిరి ప్రదక్షిణలో సుమారు లక్ష కు పైగా భక్తులు పాల్గొన్నారు.అయితే సత్యగిరి ప్రదక్షిణకు ముందుగా ఉదయం 7-30 ని.లకు కొండపై నుండి సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మెట్ల మార్గంలో వెండి పల్లకిపై తీసుకొని వచ్చి తొలిపావాంచాల వద్ద ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణప్రారంభించారు.అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ముందు తీసుకువెళ్లుతుండగా వెనుక సత్యరధంతో భాజా,భజంత్రీల నడుమ తీన్ మార్ వాయిధ్యము,కోలాటాల నడుమ భక్తజనం నడుచుకుంటూ వెళ్లారు. గ్రామంలోని ప్రధాన మార్గం మీదుగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయం,టోల్ గేటు,సుబ్బరాయ పురం,సాక్షి గనపతి ఆలయం మీదుగా జాతీయ రహదారిపైకి చేరుకొని అక్కడ నుండి బెండపూడి గ్రామానికి ముందుగా ఉన్న పోలవరం కాలువ గట్టు మీదుగా మామిడి తోటల్లో నుంచి పంపాసరోవరం చెంతగా ఉన్న పంపాఘాట్ నుంచి రత్నగిరి, సత్యగిరి లను చుడుతూ దిగువ ఘాట్ రోడ్డు మీదుగా పాత టోల్ గేటు నుంచి తొలిపావాంచల వద్దకు చేరుకుంది.అయితే గిరి ప్రదక్షిణ సుమారు 10 కిలోమీటర్ల మేర ఉంది.ఈ గిరి ప్రదక్షిణ ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.30 గంటల మధ్య ముగిసినది.ఈ గిరి ప్రదక్షిణలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతీ కిలో మీటరు కి ఒక్క స్టాల్ ను ఏర్పాటు చేసి మజ్జిగ ప్యాకెట్లు, మంచినీళ్ళు ప్యాకెట్లు, మంచినీళ్ళు,పండ్లు తదితర వస్తువు లను పంపిణీ చేసారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లెకుండా చేయడంలో దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్ర, పిఆర్వో తులా. రాముడు తగిన ఏర్పాట్లు ఎక్కడికి అక్కడ ఏర్పాట్లు చేయడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేసారు.అదేవిధంగా ఎస్సై పార్ధసారధి, సిఐ అద్దంకి.శ్రీనివాస్ ఆద్వర్యంలో తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి భక్తులకుఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎమ్. జితేంద్ర,చైర్మెన్ ఐవి.రోహిత్,ఏసి ఈరంకి. జగన్నాధరావు,పిఆర్వో తులా.రాముడు, ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరపుల.సుబ్బారావు,టిటిడి మాజీ చైర్మెన్ కనుమూరి.బాపిరాజు,దేవస్థానం పాలకమండలి.సభ్యులు యనమల.రాజేష్, కొత్త.కొండబాబు,పర్వత.రాజబాబు, సింగిలిదేవి. సత్తిరాజు మరియు తుని మార్కెట్ యార్డు చైర్మెన్ యనమల.కృష్ణుడు,పోల్నాటి.శేషగిరిరావు దేవస్థానం అధికారులు,సిబ్బంది,రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన అశేష భక్తజనం మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





# జగనన్నను చూసి చంద్రబాబు భయపడిపోతున్నాడు

## 'అన్న వస్తున్నాడు..' పాటల కేసెట్ ఆవిష్కరణ



విశాఖ సిటీ : చంద్రబాబు నాయుడు జగన్ అంటే భయపడిపోతున్నాడనీ, వచ్చే ఎన్నికల్లో కూడా 2014లాగే మభ్యపెట్టి అధికారం దక్కించుకోవటానికి ఎంతకైనా తెగిస్తున్నాడనీ విశాఖ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మళ్ల విజయ ప్రసాద్ అన్నారు.

తమ కార్యాలయంలో పార్టీ యువజన విభాగం రూపొందించిన 'అన్న వస్తున్నాడు' పాటను ఇతర నేతలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితానుంచి విపక్షాల ఓట్లు తొలగించటం మొదలు కాంగ్రెస్‌తో అపవిత్ర పొత్తు వరకూ చంద్రబాబు చేస్తున్న డ్రామాలన్నీ జనం గమనిస్తున్నారన్నారు. తగిన సమయంలో బుద్ధి చెబుతారనీ అన్నారు. శెట్టి వినయ్ ఈ పాటకి వీడియో చిత్రీకరించారు. ఈపాటను జనంలోకి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో అరుకు సమన్వయకర్త శెట్టి ఫల్గుణ, కళా ఆసుపత్రి అధినేత, దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త డాక్టరు పైడి వెంకట రమణ మూర్తి, రవిరెడ్డి , జాన్ వేస్లీ , అనుబంధ సంఘాల నాయకులు గరికిన గౌరి , రాజీవ్ గాంధీ, బాకీ శ్యాం రెడ్డి , షరీఫ్, తడబరికి సురేషు, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, కాంతారావు, లకే చిట్టిబాబు , సి. రామమూర్తి , నానీ , మత్స్య లింగం , జియ్యానీ శ్రీధర్, పద్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా సింహాచలం వరాహ పుష్కరిణికి హారతి



సింహాచలం: శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామి వారి కొండ దిగువునగల వరహాపుష్కరిణిలో పుణ్యనదీ హారతీ కార్యక్రమం శోభాయమానంగా జరిగింది వరహాపుష్కరిణికి పుణ్యనది హారతి కార్యక్రమం మానవ వనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథి హాజరై ఈ హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని కొండ దిగువునగల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవమూర్తులను సాయంత్రం పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాలు మేళతాళములతో పుణ్యస్త్రీలు భక్తులతో బయలుదేరి సాయంత్రం 5:30 గం లకు పుష్కరిణికి చేరుకోగా ఉత్సవమూర్తులను వరహా పుష్కరిణి వద్ద వేంచేయింపచేసి షోడషోపచారములు పూర్తిచేసి నక్షత్రహారతి కుంభహారతి అయితి దీపార్చనలు స్వామివారికి పుష్కరిణికి సమర్పించారు అనంతరం ఫలములు పుష్పములు పానకములు నివేదనచేసి మహామంగళహారతి మంగళాశాసనం ప్రసాదవినియోగము చేశారు అనంతరం తిరువీధి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో స్త్రీ పురుషులు భక్తకోటి చుట్టుప్రక్కల గ్రామప్రజలు భారీగా పాల్గొన్నారు నదికి సమర్పించిన ఈ హారతిలో మంత్రిగారితో పాటుగా సింహాచలం దేవస్థానం ఈ ఓ కె .రామచంద్రమోహన్ స్థానిక టీడీపీ జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు పాశర్లప్రసాద్ 72 వ వార్డ్ అధ్యక్షుడు పిసిని వరహానరసింహం టీడీపీ నాయకుడు కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కర్రి అప్పలస్వామి గుసిడి శంకరరావు పంచదార్ల శ్రీనివాస్ సతివాడ శంకరరావు లండ శ్రీను నరవల అప్పారావు ఇతరనాయకులు భక్తులు పాల్గొన్నారు.

# నిరాశ.. నిస్పృహ

## భారత్ - ఆసీస్ రెండో టీ-20 రద్దు



మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా రెండో టీ20 రద్దైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1-0తో ఆధిక్యంలో ఉంది. సిరీస్‌ను సమం చేయాలంటే చివరి మ్యాచ్‌లో టీమిండియా కచ్చితంగా విజయం సాధించాల్సిందే. వర్షం కారణంగా ఆట రద్దవ్వడం అభిమానులను నిరాశపరిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 19 ఓవర్లకు 132/7తో నిలిచింది. వర్షం రావడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత కోహ్లీసేన లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ విధానంలో 137కు సవరించారు. టీమిండియా ఛేదన ఆరంభం అవుతుందనగా వర్షం మళ్లీ కురిసింది. మైదానం సిబ్బంది పిచ్‌పై కవర్లను అలాగే ఉంచారు. వరుణుడు కాసేపు తెరపినివ్వడం.. కవర్లు తొలగించడం.. ఆటగాళ్లు మైదానంలోకి రావడం.. మళ్లీ వర్షం రావడం ఇలా చాలాసేపు గడిచింది. సమయం లేకపోవడంతో టీమిండియా ఇన్నింగ్స్‌ను 11 ఓవర్లకు కుదించి లక్ష్యాన్ని 90గా నిర్ణయించారు. మైదానం సిద్ధం కాగానే వానదేవుడు మళ్లీ ప్రత్యక్ష మయ్యాడు. వర్షం ఆగితే స్థానిక కాలమానం ప్రకారం 22:02 గంటలకు మ్యాచ్ ప్రారంభమైతే కోహ్లీసేన 5 ఓవర్లకు 46 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చేది. కాగా వరుణుడు పట్టు విడిచేలా కనిపించక పోవడం తో చివరికి మ్యాచ్‌ను రద్దుచేశారు. గబ్బాలో జరిగిన తొలి టీ20లో ఆసీస్ తొలి బ్యాటింగ్ చేసింది. 17 ఓవర్లు ముగిసిన తర్వాత వర్షం రావడంతో మ్యాచ్‌ను 45 నిమిషాలు నిలిపివేశారు.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

# నేడు ఘనంగా గౌరీపరమేశ్వరుల మహొత్సవం

యలమంచిలిః యలమంచిలి మునిసిపాలిటీ సోమలింగ పాలెం గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా జరగనుంది. ఉదయం నుండి వివిధ గ్రామాలనుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి గౌరీపరమేశ్వరులను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఉదయంనుండి స్వామి వారికి పంచామృతాభిషేకములు, విశేష అలంకరణలు, మంత్రపుష్ప నీరాజనములు సమర్పిస్తారు. సాయంత్రం ఊరేగింపు కార్యమ్రం కడు వైభవంగా జరుగుతుంది. అనంతరం జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాలలో నాటకాలు, భరతనాట్యాలు, హరికథలు, తప్పెటగుళ్ల వివిధ ప్రదర్శనలు ఉంటాయి. ఈ మహొత్సవంలో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యలమంచిలి రూరల్ ఎస్సై రాము ఆధ్వర్యంలో సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# స్టీలుప్లాంటు జూనియర్ ట్రైనీలకు ఇండక్షన్ ప్రోగ్రాం ప్రారంభం



విశాఖపట్నం: ఇటీవల నియమితులైన స్టీలుప్లాంటు జూనియర్ ట్రైనీలకు ఇండక్షన్ & ఓరియెంటేషన్ ప్రోగ్రాం ప్రారంభించారు. స్టీలుప్లాంటు డైరక్టరు (పర్సనల్) కెసి దాస్ జూనియర్ ట్రైనీలకు ఇండక్షన్ ప్రోగ్రాంను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్లాంటులో జరిగే ప్రతి దశ యొక్క పనిని, పనితీరును అత్యంత సురక్షిత ప్రమాణాలను అవలంభిస్తూ శిక్షితులవ్వామని ఆయన అన్నారు.

వారు ఒకరితో ఒకరు పనిలో సత్సంబంధాలను ఏర్పరచుకొని అంచెల ంచెలుగా ఎదగాలని కోరారు.

# 2 లక్షల సందేహాస్పద ఓటర్లపై విచారణ జరపండి

## - క్లైమ్‌లను ఈ నెలాఖరుకల్లా పరిష్కరించాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి. సిసోడియా




విశాఖపట్నంః ఓటర్ల జాబితాలో సందేహాస్పదంగా గుర్తించిన 2 లక్షల 767 మంది ఓటర్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, రానున్న పది రోజుల్లో నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచాలని, మిగిలిన వారి పేర్లు తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి. సిసోడియా జిల్లా సంయుక్త కలెక్టర్ జి. సృజనను ఆదేశించారు. ఇందుకు ఇంటింటి సర్వే నిర్వహించి నిజమైన ఓట్లను గుర్తించాలని ఆయన అన్నారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి 2019 ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాల ప్రగతిని జిల్లాల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆర్.పి. సిసోడియా మాట్లాడుతూ 2019 ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలను వేగవంతం చేసి 2019 జనవరి 3న సప్లమెంటరీ జాబితాను, 4న తుది ఓటర్ల జాబితాను ముద్రించాల్సి ఉందన్నారు.

ఈలోపు అందిన క్లైమ్స్‌ను అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి ఈ నెలాఖరుకల్లా పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితానుండి పేర్ల తొలగింపు ప్రక్రియను నియమ నిబంధనల మేరకు నిర్వర్తించాలని, ఈ విషయంలో ఎటువంటి విమర్శలకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అందరికీ ఆమోదయోగ్యమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని, విమర్శలకు తావు లేకుండా చూడాలని, డూప్లికేట్ ఓటర్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆయన సూచించారు. ఇ.పి. రేషియే. జండర్ రిషియోలను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. ఓటర్ల నివాసిత ప్రాంతాలకు రెండు కి.మీ. దూరం మించకుండా పోలింగ్ స్టేషన్లు ఉండేలా చూడాలన్నారు.

జాయింట్ కలెక్టర్-2 ఎ. శిరి, జిల్లా రెవెన్యూ అధికారి సి. చంద్రశేఖర రెడ్డి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com